


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 2, పేజీలు - 08

శనివారం, మే 31, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati




## బీఆర్ఎస్‌తో పొత్తు మాకేం అవసరం?

**- బీజేపీ నేత రఘునందన్ రావు**

2లో..



## నైజీరియాలో వరద బీభత్సం

**- వంద మందికి పైగా మృతి**

2లో..



# తెలంగాణ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధం



### - కొత్త మంత్రులు వెళ్లేనా.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎదురుచూస్తున్న కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త మంత్రుల జాబితాను ఖరారు చేసేందుకు ఢిల్లీ వెళ్లారు. అక్కడ ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు రాహుల్ గాంధీతో కీలక చర్చలు జరపనున్నారు. ఈ విస్తరణ ద్వారా పాలనా వ్యవహారాల్లో మరింత సమర్థతను తీసుకురావాలని, అలాగే పార్టీలో సమతూకాన్ని సాధించాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**కొత్త మంత్రుల ఎంపికలో కీలక అంశాలు..**

కొత్త మంత్రుల ఎంపికలో అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. సామాజిక సమీకరణాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఉమ్మడి జిల్లాల వారీగా ప్రాతినిధ్యం వంటి అంశాలు ప్రాధాన్యతను సంతరించుకోనున్నాయి. అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా, అలాగే ప్రాంతీయ సమతుల్యతను పాటించేలా జాబితాను రూపొందించే అవకాశం ఉంది. పార్టీ పెద్దలతో సీఎం రేవంత్ సమావేశం అనంతరం ఏ క్షణమైనా కొత్త మంత్రులను ఖరారు చేసే అవకాశం ఉంది. ఈసారి తెలంగాణ క్యాబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అలాగే ఎస్సీ మాల సామాజిక వర్గం నుంచి వివేక్ పేర్లు దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. వీరిద్దరిని ఎన్నికల సమయంలోనే పార్టీ అధికారంలోకి వస్తే మంత్రి పదవి గ్యారంటీ అనే హామీతో కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. ఈ నేపథ్యంలో, వారికి పదవులు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**ఖాళీలు, ప్రాంతీయ డిమాండ్లు**

ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డితో కలిపి మొత్తం 12 మంది మంత్రులు ఉన్నారు. క్యాబినెట్‌లో గరిష్ఠంగా 18 మందికి అవకాశం ఉంది. దీంతో మరో 6 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ విస్తరణలో ఆరు ఖాళీలను పూర్తిగా భర్తీ చేస్తారా, లేదా మరికొన్నింటిని భవిష్యత్తు కోసం ఉంచుతారా అనేది వేచి చూడాలి. మొత్తంగా, అనేక సామాజిక, ఆర్థిక, ప్రాంతీయ అంశాలను పరిగణనలోకి తీసుకొని మంత్రివర్గాన్ని పునర్ వ్యవస్థీకరించనున్నారు. మరోవైపు ప్రస్తుత తెలంగాణ క్యాబినెట్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు ఇప్పటివరకు ప్రాతినిధ్యం లభించలేదు. దీంతో ఈ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు తమకు అవకాశం ఇవ్వాలని గట్టిగా

2లో..

## మీకు నిద్రలేని రాత్రులిచ్చాం

### - పాక్ ప్రధానికి మోడీ ఘాటు కౌంటర్

- బ్రహ్మోస్ క్షిపణి దెబ్బకు పాక్ విలవిల్లాడిందన్న మోడీ
- ఆపరేషన్ సిందూర్ తో పాక్ సైన్యం యుద్ధం ఆపమని వేడుకుందని ఎద్దేవా
- పాకిస్థాన్‌లోకి వందల మైళ్లు చొచ్చుకెళ్లి ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశామని వెల్లడి
- భారత క్షిపణులు తమ లక్ష్యాలను ఛేదించాయని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంగీకారం

2లో..



## ప్రతి నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక పార్క్

- డిల్లీలో చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- సంపద సృష్టితోనే సంక్షేమ పథకాలు సాధ్యమన్న చంద్రబాబు
- పారిశ్రామికవేత్తలు సహకరిస్తేనే ఏపీ అభివృద్ధి అని వెల్లడి
- డిల్లీ సీఐఐ సదస్సులో ప్రభుత్వ విధానాలు వివరించిన సీఎం
- పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలతో దేశ గతి మార్పు
- ప్రధాని మోదీ నాయకత్వం దేశానికి ప్రధాన బలం అన్న చంద్రబాబు




**న్యూఢిల్లీ / అమరావతి (ప్రశ్న న్యూస్)** ప్రతి నియోజకవర్గంలో ఒక పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పారిశ్రమలను ప్రోత్సహించి బిజినెస్ ప్రారంభమైతేనే ఆదాయం పెరుగుతుందని అన్నారు. అప్పుడే సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఇవ్వగలమని పేర్కొన్నారు. ఇప్పుడు చాలా సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు. బిజినెస్ సెక్టార్‌లో ఉన్న భయాలు తొలగించే ప్రయత్నం మహానాడు వేదికగా చేశామని వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. ఏపీ ప్రభుత్వ విధానాలు, పెట్టుబడుల అవకాశాలు వచ్చిన వాళ్లకు వివరించారు. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక

2లో..

## కేసీఆర్‌ను కలిసే అవకాశం వచ్చినా.. కలవలేకపోయాను

- కేసీఆర్‌కు రాసిన లేఖ లీకేజీపై కవిత తీవ్ర స్పందన
- నా జెండా, అజెండా బీఆర్ఎస్సే అంటూ స్పష్టీకరణ
- బీజేపీతో బీఆర్ఎస్ ను విలీనం చేసే అంశాన్ని ? తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు వెల్లడి

2లో..



## త్రీ గోర్జెస్ డ్యామ్ లాంటి అద్భుతం కాళేశ్వరం

### - లండన్ బ్రిడ్జ్ ఇండియా సదస్సులో కేటీఆర్ వ్యాఖ్యలు

- బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ ప్రగతి ప్రపంచానికే ఆదర్శమని వ్యాఖ్య
- సంపద సృష్టించి, అట్టడుగు వర్గాలకు పంచడమే తమ విధానమని వెల్లడి
- కాళేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టుల విజయాలను ప్రస్తావించిన కేటీఆర్
- కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేశామన్న కేటీఆర్



**హైదరాబాద్ / లండన్ (ప్రశ్న న్యూస్)** దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మార్చాలన్న చిత్తశుద్ధి ఉంటే అద్భుతమైన ప్రగతి సాధ్యమని తెలంగాణ నిరూపించిందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికే కాదు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. స్థిరమైన వృద్ధితో ప్రపంచ ఆర్థిక రంగాన్ని నడిపించడంలో తెలంగాణ ఎందుకు ముఖ్యం? అన్న అంశంపై లండన్ బ్రిడ్జ్ ఇండియా వీక్ 2025 సదస్సులో కేటీఆర్ ప్రధాన ఉపన్యాసం ఇచ్చారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక పంథాను అనుసరించి వివిధ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు,

2లో..

## కవిత వ్యవహారం ఫ్యామిలీ డ్రామా

### - స్పందించిన కిషన్ రెడ్డి

- డాడీ.. డాటర్, సిస్టర్.. బ్రదర్ సమస్య
- బీజేపీకి సంబంధం లేదని స్పష్టీకరణ
- బీజేపీ నేతలు మాట్లాడొద్దని సూచన
- పీఓకేను పాకిస్థాన్‌కు ఎవరిచ్చారని ప్రశ్న



**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ వ్యవహారంపై కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి స్పందించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ మొత్తం వ్యవహారాన్ని కేసీఆర్ కుటుంబానికి

2లో..

## జగన్‌ను జనంలోకి రాకుండా ఆపుతుందెవరు.?

### - తెర వెనుక ఏం జరుగుతోంది.?



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఏపీలో రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న కూటమి పార్టీలు వైసీపీని లక్ష్యంగా చేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం పైన ఊహించని వ్యతిరేకత ఉందనేది మాజీ సీఎం జగన్ అంచనా. ప్రభుత్వం ఇచ్చిన హామీలు విస్మరించి.. రెడ్ బుక్ పాలన కే పరిమితం అయిందని జగన్ ప్రతీ సందర్భంలో విమర్శిస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలకు నిర్ణయిస్తున్నారు. జగన్ మాత్రం బయటకు రావటం లేదు. కొందరి సలహాలను జగన్ పాటిస్తున్నారనే చర్చ మొదలైంది. ఇంతకీ అసలు ఏం జరుగుతోంది.

**ఓటమి తరువాత**

2024 ఎన్నికల్లో పరాజయం తరువాత జగన్ లో మార్పు రావాలని పార్టీ నేతలు కోరుకున్నారు. జగన్ సైతం తాను అధికారంలో ఉన్న సమయంలో పార్టీ కార్యకర్తలను పట్టించుకోలేదని ఈ సారి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇస్తున్నారు. దాడులకు గురైన కార్యకర్తలను గతం కంటే భిన్నంగా పరామర్శిస్తున్నారు.

2లో..

## బీఎస్ఎఫ్ దెబ్బకు పాక్ విలవిల్లాడింది

### - పాకిస్థాన్ కోలుకోవడానికి కనీసం నాలుగైదేళ్లు పడుతుంది



**శ్రీనగర్ (ప్రశ్న న్యూస్)** ఆపరేషన్ సిందూర్ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా తొలిసారిగా జమ్మూకశ్మీర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత బలగాల ధైర్యసాహసాలను కొనియాడారు. "ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిగా, పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దుల్లోని పౌరులపై దాడులకు తెగబడింది. అయితే, మన బీఎస్ఎఫ్ దళాలు ఈ దాడులను అత్యంత సమర్థవంతంగా తిప్పికొట్టాయి" అని తెలిపారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌కు చెందిన సుమారు 118 పోస్టులను మన బలగాలు నాశనం చేశాయని ఆయన వెల్లడించారు. "శత్రువుల

2లో..

## మారనున్న అమీర్‌పేట రూపురేఖలు

### - హెచ్ఎండీఏ నయా ప్లాన్ - మెట్రో స్టేషన్ దగ్గరే బస్ స్టాప్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు రేవంత్ సర్కార్ చర్యలు తీసుకుంటుంది. దీనిలో భాగంగా హై సిటీ ప్రాజెక్ట్‌ని ప్రారంభించి రద్దీ ఉండే ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టేందుకు రెడీ అయ్యింది.

2లో..

## జూన్ 4న 'వెన్నుపోటు దినం' కార్యక్రమం

### - పోస్టర్ ను ఆవిష్కరించిన వైసీపీ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా సంపూర్ణంగా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జూన్ 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. తాడేపల్లిలోని వైసీపీ

2లో..

## బీజేపీ, బీఆర్ఎస్ రహస్యంగా కుమ్మక్కయ్యాయి

### - టీపీసీసీ చీఫ్ ఆరోపణ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రహస్య అవగాహన ఉందని, అందుకు అనుగుణంగానే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుల మధ్య రహస్య భేటీ

2లో..

# బీఆర్ఎస్‌తో పొత్తు మాకేం అవసరం?

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీజేపీలో బీఆర్ఎస్ ను విలీనం చేసే ప్రయత్నం జరిగిందని, ఇందుకోసం చర్చలు జరిపారని ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై బీజేపీ సీనియర్ నేత, మెదక్ ఎంపీ రఘునందన్ రావు తాజాగా స్పందించారు. బీఆర్ఎస్ కుటుంబ కలహాలలోకి కవిత బీజేపీని లాగుతోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ లో ప్రస్తుతం కవిత చెల్లని రూపాయిగా మారారని విమర్శించారు. ఆ పార్టీలో, కేసీఆర్ కుటుంబంలో జరుగుతున్న అంతర్గత గొడవలలోకి కవిత బీజేపీని లాగుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ తో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం బీజేపీకి ఎంతమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ అధిష్టానం కానీ, రాష్ట్ర నాయకత్వం కానీ ఆ దిశగా ఎలాంటి చర్చలు జరపలేదని రఘునందన్ రావు తేల్చిచెప్పారు. ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై స్పందిస్తూ బీఆర్ఎస్ లో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, సోషల్ మీడియాలో తన వ్యక్తిత్వ హననం జరుగుతోందని కవిత ఆరోపించిందని గుర్తుచేశారు. ఈ ఆరోపణలపై తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఈ ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరారు. కవిత వ్యక్తిత్వహననానికి పాల్పడుతుంది ఎవరనేది తేల్చాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పెయిడ్ బ్యాచ్ ను మెయింటెయిన్ చేస్తున్నారని రఘునందన్ రావు ఆరోపించారు. దాదాపు 20 యూట్యూబ్ ఛానల్స్ కు కేటీఆర్ జీతాలు ఇస్తున్నారని, తన పత్రికలోనూ తప్పుడు కథనాలను ప్రచురించేలా చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో బీజేపీ మినహా దాదాపు అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకుందని రఘునందన్ రావు గుర్తు చేశారు. కాంగ్రెస్ తో అంటకాగుతూ 2014 లో ఆ పార్టీని విలీనం చేసేందుకు కేసీఆర్ ప్రయత్నించారని గుర్తుచేశారు. కుటుంబం మొత్తం ఢిల్లీకి వెళ్లి సోనియా గాంధీ కాళ్లపై పడ్డారని చెప్పారు. బీఆర్ఎస్ వల్ల తెలంగాణ ప్రజలకు రూపాయి ప్రయోజనం కూడా లేకుండా పోయిందని చెప్పారు. అమరవీరుల కుటుంబాలకు సైతం రూపాయి కూడా దక్కలేదని రఘునందన్ రావు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేవలం కేసీఆర్ కుటుంబ ఆస్తులు మాత్రమే పెరిగాయని ఆరోపించారు.అందుకే బీఆర్ఎస్ గా మారిన టీఆర్ఎస్ కు తెలంగాణ ప్రజలు వీఆర్ఎస్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఇలాంటి కుటుంబ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం తమ పార్టీకి లేదని కుండబద్దలు కొట్టారు. తెలంగాణలో బీజేపీ సొంతంగానే ఎదుగుతోందని రఘునందన్ రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ బీజేపీ ప్రజలకు చేరువ అవుతోందని తెలిపారు.

# నైజీరియాలో వరద బీభత్సం

నైజీరియా (ప్రశ్న న్యూస్) పశ్చిమాఫ్రికా దేశం నైజీరియాలో భారీ వర్షాలు, వరదలు తీవ్ర విషాదాన్ని సృష్టించాయి. గురువారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పలు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీనికి తోడు ఓ భారీ డ్యామ్ కుప్పకూలడంతో వరద ఉధృతి ఊహించని విధంగా పెరిగి, పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈ ప్రకృతి విపత్తు కారణంగా ఇప్పటివరకు 111 మంది మృతి చెందినట్లు అధికారిక వర్గాలు ధృవీకరించాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. నైజీరియాలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. భారీ వరదల ప్రవాహానికి ఇళ్లు, వాహనాలు కొట్టుకుపోయాయి. అనేకమంది నివాసాలు కోల్పోయి నిరాశ్రయులయ్యారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం సాయంత్రం నాటికి 111 మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీశాయి. వేలాది మంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.నైజీరియాకు ఇలాంటి వరదలు కొత్తేమీ కాదు. గత ఏడాది సెప్టెంబరులో కూడా ఇలాంటి భయానక వరదల కారణంగా ఆనకట్టలు తెగిపోయి సుమారు 30 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో కూడా లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. దేశంలో ఇప్పటికే బోకో హరామ్ వంటి ఉగ్రవాద సంస్థల కార్యకలాపాల వల్ల మానవతా సంక్షోభం నెలకొంది. తాజా వరదలు ఈ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేశాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగానే నైజీరియా తరచుగా తీవ్ర వరదలను ఎదుర్కొంటోందని, స్వల్ప వ్యవధిలోనే అధిక వర్షపాతం నమోదై భారీ నష్టాన్ని కలిగిస్తోందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుత వర్షాలు కూడా అదే కోవలోకి వస్తాయని, ఒక్కసారిగా కుండపోత వర్షం కురవడంతో ఊహించని స్థాయిలో వరదలు సంభవించి భారీ ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ప్రభుత్వం తక్షణ సహాయక చర్యలు చేపట్టినా, నష్టం తీవ్రత ఎక్కువగా ఉండటంతో సాధారణ పరిస్థితి నెలకొనడానికి సమయం పట్టే అవకాశం ఉంది.

## తెలంగాణ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధం

డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్లను అధిష్ఠానం ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటుందో చూడాలి. ఈ క్యాబినెట్ విస్తరణ తెలంగాణ రాజకీయాల్లో నూతన సమీకరణాలకు, ఆశలకు తెరలేపే అవకాశం ఉంది.

# మీకు నిద్రలేని రాత్రులిచ్చాం

కాన్పూర్ (ప్రశ్న న్యూస్) పహల్గాం ఉగ్రదాడికి కౌంటర్ గా పాకిస్తాన్ పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతమైంది. పాకిస్తాన్ లో ఉగ్రవాద శిబిరాలతో పాటు కీలకమైన రక్షణ స్థావరాలు, ఎయిర్ బేస్ లను సైతం భారత్ దెబ్బతీసింది. అయితే ఇందులో బ్రహ్మోస్ క్షిపణులు కీలక పాత్ర పోషించాయి. వీటి గొప్పతనాన్ని తాజాగా పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా అంగీకరించారు. తాము భారత్ పై దాడి చేసేలోపే బ్రహ్మోస్ తో ఆ దేశం తమపై దాడి చేసేసిందని వాపోయారు. దీనిపై భారత ప్రధాని మోడీ స్పందించారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కామెంట్స్ ను గుర్తుచేస్తూ ఆ దేశానికి తాము బ్రహ్మోస్ తో నిద్రలేని రాత్రులు ఇచ్చామని ప్రధాని మోడీ గుర్తుచేసారు. ఉత్తర్ ప్రదేశ్ లోని కాన్పూర్ లో 50 వేల కోట్ల విలువైన ఇన్ ఫ్రా ప్రాజెక్టుల్ని ప్రారంభించేందుకు వచ్చిన ప్రధాని మోడీ పాకిస్తాన్ తో జరిగిన ఆపరేషన్ సింధూర్ ను గుర్తుచేశారు. పాకిస్తాన్ లోపలికి వందల మైళ్లు చొచ్చుకుని వెళ్లి మరీ ఉగ్రవాద శిబిరాలను తాము ధ్వంసం చేసామని ప్రధాని తెలిపారు. మన సాయుధ దళాల వీరోచిత చర్యలతో పాక్ సైన్యాన్ని యుద్ధాన్ని ఆపమని వేడుకోవలసి వచ్చిందని ప్రధాని మోడీ గుర్తుచేశారు. ఆపరేషన్ సింధూర్ భారతదేశ సైనిక శక్తిని ప్రపంచానికి ప్రదర్శించిందని ప్రకటించారు. అలాగే బ్రహ్మోస్ క్షిపణిపై ప్రత్యేకంగా ప్రశంసల జల్లు కురిపించారు. బ్రహ్మోస్ పాక్ కు నిద్రలేని రాత్రులు ఇచ్చిందన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయాలపై ఇప్పటికే గుజరాత్, బీహార్ లో పలుమార్లు ప్రస్తావించిన ప్రధాని మోడీ ఇవాళ కాన్పూర్ లోనూ అవే విషయాల్ని చెప్పుకొచ్చారు. ఇప్పటికే ఆపరేషన్ సింధూర్ విజయాల్ని ప్రధాని ఆర్మీ నుంచి తమ ఖాతాలోకి వేసుకుంటున్నారన్న విపక్షాల విమర్శల నేపథ్యంలో తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## ప్రతి నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక పార్క్

పార్కులు ఏర్పాటు చేయబోతున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇంటికో పారిశ్రామికవేత్త తయారు చేయాలన్నదే లక్ష్యమన్నారు. మొదటి నుంచి పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాతావరణం సృష్టిస్తూ వచ్చామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి అనేక సదస్సు నిర్వహించి భారీగా పెట్టుబడులు ఆహ్వానించామని తెలిపారు. ఆ ఫలితాలు కనిపిస్తున్నాయని ఇప్పుడు అదే ప్రయత్నంలో ఉన్నామని వివరించారు. ప్రజలకు సంక్షేమ ఫలాలు అందివ్వాలన్నా, రాష్ట్రాభివృద్ధి సాధించాలన్నా పారిశ్రామికవేత్తలతోనే అవుతుందని తెలిపారు చంద్రబాబు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సంస్కరణలు చేపట్టి సంపద సృష్టించామని అన్నారు. అవకాశాలను అనుకూలంగా మార్చుకొని రాష్ట్రాన్ని నూతన మార్గంలో నడిపించామన్నారు చంద్రబాబు. ఇప్పుడు కూడా అలాంటి ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, డ్రోన్లు అభివృద్ధిలో కీలక పాత్రపోషిస్తాయని అందుకే వాటిని ప్రోత్సహిస్తున్నట్టు వివరించారు. సీసీ కెమెరాలు, సెన్సార్లు, ఐటీలు ఇలా టెక్నాలజీ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు.ఇప్పుడు అందివస్తున్న అవకాశాలు వినియోగించుకొని సవాళ్లు అధిగమించిన వాళ్లే రాణిస్తారని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. అందుకు ప్రభుత్వం చేయూత అందిస్తే ఇంటికో పారిశ్రామికవేత్త రావడం పెద్ద కష్టం కాదన్నారు. ఇలాంటి సరైన సమయంలో మోదీ లాంటి నాయకులు ప్రధానిగా ఉండటం దేశానికి బలం అని అభిప్రాయపడ్డారు. అటు కేంద్రంలో ఇటురాష్ట్రంలో ప్రభుత్వాలు పటిష్టంగా ఉన్నందున పెద్ద పెద్ద సంస్థలు ఏపీకి వస్తున్నట్టు చంద్రబాబు తెలిపారు. విశాఖలో టీసీఎస్, ఆర్సెల్లార్ మిట్టల్, గూగుల్ ఇలాంటి సంస్థలు త్వరలోనే పనులు ప్రారంభిస్తాయని వివరించారు. గ్రీన్ ఎనర్జీకి, సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీకి ఏపీలో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

అనుకున్న ప్రాజెక్టులు లైవ్ అయితే నాలుగున్నర లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. అంతకు ముందు పార్టీ నేతలతో మాట్లాడిన చంద్రబాబు కంటిన్యూగా అధికారంలో ఉండి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదన్న సీఎం ఇప్పుడు మరోసారి పొరపాటు జరగకుండా చూడాలని అన్నారు. ప్రజల్లోకి ఈ విషయాన్ని తీసుకెళ్లాలని పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. కడప మహానాడు వేదికగా ఇదే అంశాన్ని స్పష్టం చేశామని వివరించారు. మహానాడు అద్భుతంగా జరిగిందని జిల్లా నాయకత్వమంతా సమష్టిగా పని చేసి కార్యక్రమాన్ని సక్సెస్‌ఫుల్ చేశారని కితాబు ఇచ్చారు. అందర్నీ అభినందించారు. మహానాడులో ప్రవేశ పెట్టిన శాసనాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో చాలా ఆశలు ఉన్నాయని అదే టైంలో సానుకూలత ఉందని చంద్రబాబు తెలిపారు. ప్రజాప్రతినిధులు కూడా నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు. త్వరలోనే సంక్షేమ క్యాలెండర్ ప్రకటిస్తామని పేర్కొన్నారు. అలా ప్రకటించడానికి ముందు సంపద సృష్టిపై దృష్టి పెట్టామన్నారు. సంపద సృష్టించకపోతే సంక్షేమ ఫలితాలు ప్రజలకు అందివ్వలేమని పేర్కొన్నారు.

# కేసీఆర్‌ను కలిసే అవకాశం వచ్చినా.. కలవలేకపోయాను

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్‌కు రాసిన లేఖ బయటకు రావడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మరోసారి తీవ్రంగా స్పందించారు. మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆమె పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తాను రాసిన లేఖ ఎలా బహిర్గతమైందో, దీని వెనుక ఎవరి ప్రమేయం ఉందో తేల్చాలని ఆమె డిమాండ్ చేశారు. లేఖ రాయడానికి ముందే కేసీఆర్‌ను కలిసే అవకాశం వచ్చినా, కొన్ని కారణాల వల్ల కలవలేకపోయానని కవిత తెలిపారు. “నాకంటూ ప్రత్యేక జెండా గానీ, అజెండా గానీ లేవు. బీఆర్ఎస్ నా పార్టీ, కేసీఆరే నా నాయకుడు” అని కవిత మరోసారి తేల్చిచెప్పారు. పార్టీని కాపాడుకోవడమే తన ప్రధాన లక్ష్యమని ఆమె అన్నారు. పార్టీలో కేసీఆర్ నాయకత్వాన్ని తప్ప మరెవరి నాయకత్వాన్ని తాను అంగీకరించే ప్రసక్తి లేదని కుండబద్దలు కొట్టారు. బీజేపీతో పొత్తుల అంశంపైనా కవిత ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ పార్టీ బీజేపీ వైపు చూడకూడదని బీజేపీతో పొత్తు పెట్టుకుని బాగుపడిన పార్టీలు చరిత్రలో లేవు అని ఆమె వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తామంటే అస్సలు ఒప్పుకునేది లేదని ఆమె స్పష్టం చేశారు. పార్టీలో నెలకొన్న సమస్యలు, పుట్టుకొస్తున్న కోవర్టుల గురించే తాను అధినేతకు లేఖ రాశానని, ఇందులో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నో ఆవేదనలు భరించలేకే ఈ లేఖ రాయాల్సి వచ్చిందని తెలిపారు. “నా మీద దృష్టి తగ్గించి, ముందు లేఖను లీక్ చేసిన వారిని పట్టుకోండి” అని పార్టీ అధిష్ఠానానికి ఆమె హితవు పలికారు.

## త్రీ గోర్జెస్ డ్యామ్ లాంటి

# అద్భుతం కాళేశ్వరం

పాలసీలపై తన అనుభవాలు, ఆలోచనలను ఈ సదస్సులో కేటీఆర్ పంచుకున్నారు. సంపదను సృష్టించడంతో పాటు దాన్ని సమాజంలోని అట్టడుగు వర్గాలకు సమానంగా పంచడమే తమ హయాంలో తెలంగాణను దేశంలో ప్రత్యేకంగా నిలిపిందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు. కేసీఆర్ నాయకత్వంలోని తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి మధ్య అద్భుత సమతుల్యత సాధించిందన్న కేటీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రగతిశీల పనులు స్వతంత్ర భారత చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఎవరు చేయలేదన్నారు. 9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కేంద్రంగా సాగిన పాలన, ఆలోచనలు ఆవిష్కరణలుగా మారిన విధానంతో పాటు తెలంగాణ విజయ ప్రస్థానాన్ని కేటీఆర్ అద్భుతంగా వివరించారు. వివిధ దేశాల రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు హాజరైన ఈ సదస్సులో మాట్లాడిన కేటీఆర్, తలసరి ఆదాయంలో 12వ స్థానం నుండి మొదటి స్థానానికి ఎలా ఎదగవచ్చో తెలంగాణ నుండి భారతదేశంలోని ఇతర రాష్ట్రాలు నేర్చుకోవచ్చన్నారు. తమ హయాంలో పాలనను ప్రజలకు చేరువ చేయడంతో పాటు ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి వ్యక్తుల కంటే విధానాలకే ప్రాధాన్యత ఇచ్చామన్నారు. విప్లవాత్మక మార్పులను ఆహ్వానించడంతో పాటు నిర్ణయాధికారాన్ని వికేంద్రీకరించడమే తెలంగాణను మిగతా రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా మార్చిందన్నారు కేటీఆర్.వివిధ దేశాల రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు పాల్గొన్న ఈ సదస్సులో మాట్లాడిన కేటీఆర్, ఇంజనీరింగ్ అద్భుతంగా చెప్పుకునే చైనాలోని త్రీ గార్జియస్ డ్యామ్ కు సరిసమానమైన ప్రాజెక్టు తెలంగాణలోని కాళేశ్వరం అన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద బహుళ ఎత్తిపోతల పథకం కాళేశ్వరంతో 80 మీటర్ల సముద్ర మట్టపు ఎత్తు నుంచి 600 మీటర్ల ఎత్తుకు నీళ్లను తీసుకునిపోయి ప్రతీ సీజన్ కు 45 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నామన్నారు. ఇండియా లాంటి ప్రజాస్వామ్య దేశంలో ఒక ప్రాజెక్టును నిర్మించడం చాలా కష్టం అన్న కేటీఆర్, అందుకు కావలసిన అన్ని రకాల అనుమతులను తీసుకొని, ప్రాజెక్టుతో నష్టపోతున్న నిర్వాసితులకు సరైన పరిహారం ఇచ్చి కేవలం 3 సంవత్సరాల కాలంలోనే ప్రాజెక్టును పూర్తి చేసి దేశం మొత్తం నివ్వెరపోయేలా చేశామన్నారు. ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉన్న ఇండియాలో ప్రతీ ఇంటికి శుద్ధిచేసిన తాగునీటిని అందించడం స్వప్నంగానే ఉన్న సమయంలో, కేసీఆర్ నేతృత్వంలోని తమ ప్రభుత్వం దేశంలోనే తొలిసారి కోటి ఇండ్లకు మిషన్ భగీరథతో సురక్షిత మంచినీటిని అందించిందన్నారు. దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలోనూ ఉపరితల నీటి వనరులతో ప్రతీ ఇంటికి శుద్ధిచేసిన తాగునీటిని ఇప్పటికీ అందించడం లేదన్నారు. తలసరి ఆదాయంలో 156% వృద్ధిని ఒక్క దశాబ్ద కాలంలోనే సాధించిన రాష్ట్రం దేశంలో ఏదైనా ఉందంటే అది తెలంగాణ ఒక్కటే అన్నారు కేటీఆర్. 2014లో తలసరి ఆదాయంలో 12వ స్థానంలో ఉన్న తెలంగాణ, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతిశీల విధానాలతో 2023 నాటికి నంబర్ వన్ స్థానానికి చేరుకుందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాల కారణంగా గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ ,ఫేస్బుక్ తో పాటు ప్రపంచంలోని ప్రఖ్యాత టెక్ కంపెనీలు అమెరికా తర్వాత తమ అతిపెద్ద క్యాంపస్లను హైదరాబాదులో నెలకొల్పాయని కేటీఆర్ చెప్పారు. కార్పొరేట్ సంస్థల్ని హైదరాబాద్ కు ఆహ్వానించి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించామన్నారు. తాము అధికారంలోకి రావడానికి ముందు 2014 లో టెక్ పరిశ్రమలో మూడు లక్షల 23వేలు ఉద్యోగాలు మాత్రమే ఉండేవని, అయితే తాము అధికారం నుంచి దిగిపోయే నాటికి అవి పది లక్షలకు చేరాయన్నారు. ఇంతేకాదు 2014లో 56 వేల కోట్ల రూపాయలుగా ఉన్న ఐటీ ఎగుమతులు, 2023 నాటికి రెండు లక్షల 41 వేల కోట్ల రూపాయలకు చేరాయన్నారు. ఇదంతా తమ ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత, మార్గదర్శకత్వంతోనే సాధ్యమైందని తెలిపారు. ఇండియా లాంటి వైవిధ్యభరిత దేశంలో ఒక పరిశ్రమ, సంస్థను ఏర్పాటుచేయడంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయన్న కేటీఆర్, ఆ సంక్లిష్టతను టీఎస్ ఐపాస్ తో తాము దూరం చేశామన్నారు. ఆన్ లైన్ లో ఎవరైనా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లో అనుమతులు వస్తాయన్నారు. ఒకవేళ రాకుంటే అనుమతులు వచ్చినట్టుగానే భావించి పరిశ్రమను ప్రారంభించుకోవచ్చన్నారు. దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలోనూ ఈ విధానం లేదన్నారు. టీఎస్ఐపాస్ తో తమ హయాంలో 28 వేల పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామన్న కేటీఆర్, ఫలితంగా మూడున్నర లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు వచ్చాయన్నారు. 24 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పన జరిగిందన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు, అమలు చేసిన వినూత్న విధానాలతో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా ఎదిగిందన్నారు. ఇండియాలో పెట్టుబడులు పెట్టాలని కోరిన కేటీఆర్, ప్రగతిశీల రాష్ట్రమైన తెలంగాణను అందుకే ఫస్ట్ ఛాయిస్ గా ఎంచుకోవాలన్నారు. అపార అవకాశాలను అందించడంతో పాటు కలల్ని నిజం చేసుకోవాలనుకునే ప్రతీ ఒక్కరికీ తెలంగాణ లైట్ హౌజ్ లాంటిదన్నారు కేటీఆర్. ఇండియాతో పాటు ప్రపంచానికే తెలంగాణ దిక్సూచి అన్నారు.

## కవిత వ్యవహారం

# ఫ్యామిలీ డ్రామా

సంబంధించిన వ్యక్తిగత సమస్యగా అభివర్ణించారు. ఈ వ్యవహారంతో బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. కవిత చుట్టూ నెలకొన్న వివాదాలపై కిషన్ రెడ్డి మాట్లాడుతూ, “ఇది పూర్తిగా డాడీ.. డాటర్, సిస్టర్.. బ్రదర్ మధ్య నడుస్తున్న సమస్య. వారి కుటుంబానికి సంబంధించిన వ్యవహారంలో, వాళ్లు ఆడుతున్న డ్రామాలో బీజేపీ భాగస్వామి కాదు, కాబోదు” అని తేల్చిచెప్పారు.

ఈ అంశంపై బీజేపీ నాయకులు ఎవరూ స్పందించవద్దని కూడా ఆయన సూచించారు. తెలంగాణ ప్రజానీకానికి సైతం ఈ వివాదంతో ఎటువంటి సంబంధం లేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేసేందుకు చర్చలు జరుగుతున్నాయన్న ప్రచారంపై కూడా ఆయన ఘాటుగా స్పందించారు. “అసలు ఎవరు ఎవరితో చర్చలు జరిపారో బహిరంగంగా వెల్లడించాలి” అని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి నిరాధార ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికారు.

### పీఓకేను పాకిస్థాన్‌కు ఎవరిచ్చారు?

భారత సైన్యం సాధించిన విజయాలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్కువ చేసి మాట్లాడటం అత్యంత దురదృష్టకరమని జి. కిషన్ రెడ్డి అన్నారు. దేశమంతా గర్వపడే సైనిక చర్యలను ఒక పార్టీకి ఆపాదించడం సరికాదని హితవు పలికారు. సైన్యం సాధించిన విజయాలను దేశ ప్రజలందరూ పండుగలా జరుపుకుంటుంటే, రేవంత్ రెడ్డికి మాత్రం అవి బీజేపీ కార్యక్రమాలుగా కనిపించడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. “మన ఎంపీలు పార్టీలకు అతీతంగా ప్రపంచ దేశాల్లో పర్యటిస్తున్నారు.

‘ఆపరేషన్ సిందూర్’ వంటివి ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో వివరిస్తున్నారు. ఇంతకీ, పీఓకేను పాకిస్థాన్‌కు అప్పగించింది ఎవరు?” అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ వైఖరి వల్లే పీఓకే అంశం ఇప్పటికీ రావణకాష్టంలా రగులుతూనే ఉందని ఆయన ఆరోపించారు. గతంలో ఉగ్రవాదులు దాడులకు పాల్పడినప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు కేవలం సంతాప ప్రకటనలతో సరిపుచ్చాయని కిషన్ రెడ్డి విమర్శించారు. కానీ, నరేంద్ర మోదీ ప్రభుత్వం అలా వ్యవహరించలేదని, పాకిస్థాన్ భూభాగంలోకి ప్రవేశించి మరీ సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించిందని గుర్తుచేశారు. “పహల్గామ్ దాడి అనంతరం పాకిస్థాన్‌కు ఎలాంటి నరకాన్ని చూపించామో యావత్ ప్రపంచం చూసింది” అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. దేశ భద్రత, సైనిక చర్యల విషయంలో రాజకీయాలు చేయడం తగదని ఆయన సూచించారు.

# బీఎస్ఎఫ్ దెబ్బకు పాక్ విలవిల్లాడింది

సమాచార, నిఘా వ్యవస్థలను మనవాళ్లు ఒక్కొక్కటిగా కూల్చివేశారు. ఈ నష్టం నుంచి కోలుకోవడానికి పాకిస్థాన్‌కు కనీసం నాలుగైదేళ్లు పడుతుంది” అని అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ అందించిన సమాచారం ప్రకారం, పాకిస్థాన్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు ఊహించని స్థాయిలో నష్టం వాటిల్లిందని అమిత్ షా తెలిపారు. కొంతకాలం పాటు పూర్తిస్థాయి సమాచార ఆధారిత యుద్ధం చేసే స్థితిలో పాకిస్థాన్ లేదని ఆయన అన్నారు. బీఎస్ఎఫ్ దళాల అప్రమత్తత, స్పష్టమైన వ్యూహరచన, వాటిని విజయవంతంగా అమలు చేసిన తీరును హోంమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. భారత సరిహద్దుల్లో ఎలాంటి దాడి జరిగినా, ఆ భారాన్ని మొట్టమొదట మోసేది బీఎస్ఎఫ్ జవాన్లేనని ఆయన గుర్తుచేశారు. జమ్మూకశ్మీర్‌లో తన రెండు రోజుల పర్యటనలో భాగంగా, ఇటీవల పాకిస్థాన్ జరిపిన దాడుల్లో నష్టపోయిన కుటుంబాలను అమిత్ షా పరామర్శించారు. పాక్ దాడుల వల్ల దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార సముదాయాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం త్వరలోనే పరిహార ప్యాకేజీని ప్రకటిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. పాక్ దాడులతో నష్టపోయిన పలు ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన అమిత్ షా, అక్కడి స్థానిక ప్రజలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

## బీజేపీ, బీఆర్ఎస్ రహస్యంగా కుమ్మక్కయ్యాయి

జరిగిందంటూ ఆయన విమర్శించారు. సర్జికల్ స్ట్రైక్స్ విషయంలో బీజేపీ వైఖరిని మహేశ్ కుమార్ గౌడ్ తప్పుపట్టారు. “కేవలం కొన్ని సర్జికల్ స్ట్రయిక్స్ చేసి గొప్పలు చెప్పుకుంటున్నారు. అప్పట్లో ఇందిరా గాంధీ వందల కొద్దీ సర్జికల్ స్ట్రయిక్స్ చేసినా ఏనాడూ ప్రచారం చేసుకోలేదు” అని ఆయన అన్నారు. ఇందిరా గాంధీ గొప్పతనాన్ని ఆనాటి ప్రతిపక్ష నేత వాజ్‌పేయి కూడా గుర్తించి ‘అపర కాళీ’ అని ప్రశంసించారని గుర్తు చేశారు. ఇందిరాగాంధీకి, ప్రస్తుత ప్రధాని మోదీకి పోలికే లేదని ఆయన అన్నారు.బీజేపీ, బీఆర్ఎస్ మధ్య అంతర్గత సంబంధాలు నెలకొన్నాయని ఆయన ఆరోపించారు. “బీజేపీ, బీఆర్ఎస్ సయోధ్య గురించి కవిత ఇప్పుడు వాస్తవాలు బయటపెడుతున్నారు. బీఆర్ఎస్‌తో దోస్తీకి అడ్డుగా ఉన్నందునే బండి సంజయ్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించింది నిజం కాదా?” అని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీజేపీ నేతలకు ప్యాకేజీలు అందుతున్నాయని స్వయంగా ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగే చెబుతున్నారని, ఆయన మాటలకు బీజేపీ పెద్దలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శామీర్‌పేటలోని ఒక ఫామ్‌హౌస్‌లో బీజేపీ నేత ఈటల రాజేందర్, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రహస్యంగా సమావేశమయ్యారని ఆరోపించారు. “ఆ ఇద్దరూ కలిసి కేసీఆర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఈటల రాజేందర్ మోదీ పార్టీలో ఉన్నారా? లేక కేసీఆర్ పార్టీలో ఉన్నారా? తేల్చుకోవాలి. కాళేశ్వరం కుంభకోణం నుంచి బయటపడేందుకే ఈటల రాజేందర్ ఇప్పుడు కేసీఆర్‌తో చేతులు కలుపుతున్నారు” అని ఆయన ఆరోపించారు.

## జూన్ 4న ‘వెన్నుపోటు దినం’ కార్యక్రమం

కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి ‘వెన్నుపోటు దినం’ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ప్రజల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోని దుర్మార్గమైన పాలన అందిస్తున్నారని ఆరోపించారు. దేశ చరిత్రలో ఇటువంటి పాలనను ఎప్పుడూ చూడలేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఈ వైఖరిని ప్రశ్నిస్తూ, వైసీపీ తలపెట్టిన ‘వెన్నుపోటు దినం’ నిరసన కార్యక్రమాల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు కళ్లు తెరిపిస్తామని సజ్జల పేర్కొన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తన ఏడాది పాలనలో నిరంకుశ, అరాచక విధానాలను ప్రజలకు పరిచయం చేసిందని సజ్జల విమర్శించారు. కూటమి పార్టీలు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను భ్రమల్లోకి నెట్టి అధికారంలోకి వచ్చి జూన్ 4వ తేదీకి ఏడాది అవుతోందని, ఒక్క ఎన్నికల హామీని కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను దారుణంగా మోసం చేయడం చరిత్రలో ఎన్నడూ జరగలేదని ఆయన అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా ఉండేందుకు రాష్ట్రంలో భయోత్పాత వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం చాలా కష్టమని చెబుతున్నారని సజ్జల ఎత్తి చూపారు. సంపద సృష్టిస్తానని, పేదల బతుకుల్లో వెలుగులు నింపుతానంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు, ఇప్పుడు ‘పీ-4’ అంటూ కొత్త నాటకాలకు తెరతీశారని, పేదరిక నిర్మూలన బాధ్యత నుంచి తప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 1995లో సొంత మామకు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఆ తర్వాత 1999, 2014, 2024 ఎన్నికల్లోనూ ప్రజలను మోసం చేసి అధికారం చేపట్టారని విమర్శించారు. గతంలో హామీలను అమలు చేస్తానంటూ అబద్ధాలు చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు బరితెగించి హామీలను అమలు చేయడం కుదరదంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని సజ్జల మండిపడ్డారు.చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఏడాదిలోనే రాష్ట్రంపై రూ.1.49 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని, ఆ సొమ్మును దేనికి వినియోగించారో తెలియడం లేదని సజ్జల అన్నారు. ఆనాడు మామకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు, ఈరోజు నేరుగా తనను నమ్మి ఓటు వేసిన ప్రజలనే వెన్నుపోటు పొడిచారని అన్నారు. ఈ మోసాన్ని ప్రశ్నిస్తూ వైసీపీ ‘వెన్నుపోటు దినం’ నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ శ్రేణులు ర్యాలీలుగా వెళ్లి స్థానిక అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తాయని చెప్పారు. ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని, ఈ ఏడాది కాలంగా ప్రజలకు ఇస్తామన్న అన్ని పథకాల లబ్ధిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో పాటు మోసపోయిన ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీయాలని సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, ఆదిమూలపు సురేష్, అంబటి రాంబాబు, సాకే శైలజానాథ్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, కుంభా రవి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# మారనున్న అమీర్‌పేట రూపురేఖలు

వీటి కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయనుంది. ఇదిలా ఉంటే అమీర్‌పేట రూపురేఖలు మార్చేందుకు హెచ్ఎండీఏలోని యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ(ఉమ్టా) ప్రణాళికలు రెడీ చేసింది.నగరంలో విపరీతమైన రద్దీ ఉండే ప్రాంతాల్లో అమీర్‌పేట ఒకటి. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం రద్దీతో కిటకిటలాడుతుంటుంది. ఇక్కడే మెట్రో ఇంటర్‌చేంజ్ స్టేషన్, బస్ స్టేషన్, పలు రహదారుల కలయిక ఉండటం వల్ల వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈక్రమంలో అమీర్‌పేట ప్రాంతంలో ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఉమ్టా రెడీ అవుతోంది. ఇందుకోసం మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్ ప్లాన్‌ను ప్రతిపాదించింది. పైలెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా అమీర్‌పేటలో దీన్ని అమలు చేసేందుకు ఉమ్టా రెడీ అవుతోంది. ఇది అమలయితే అమీర్‌పేట రూపురేఖలు మారుతాయి.అంతేకాక దీని ఆధారంగా భవిష్యత్తులో నాంపల్లి, సికింద్రాబాద్ వంటి రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మల్టీమోడల్ ఇంటిగ్రేషన్‌ను అమలు చేయాలని భావిస్తున్నారు. దీని కోసం ట్రాఫిక్, మెట్రో, టీజీఎస్ఆర్టీసీ, జీహెచ్ఎంసీ,పోలీసు శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు అడుగులు వేస్తోంది. ఏడాది నుంచి దీనిపై సమావేశాలు నిర్వహిస్తూ ఇప్పటికి ఓ కొలిక్కి తీసుకువచ్చారు. మల్టీమోడల్ ఇంటిగ్రేషన్ ప్లాన్‌లో భాగంగా మెట్రో, బస్సు వివిధ ప్రజా రవాణా వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. మెట్రో దిగిన వారు బస్సు, బస్ దిగిన వారు మెట్రో ఎక్కేందుకు అనుకూలంగా చర్యలు తీసుకోనున్నారు. ఇందుకోసం 500 చదరపు మీటర్ల పరిధిని ప్రభావితంచేసేలా వాహనాల పార్కింగ్, ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసుకోవడానికి అనువుగా ప్రణాళికలు రూపొందించారు. అలానే స్వర్ణ జయంతి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న బస్టాండ్లను మెట్రో స్టేషన్ సమీపంలోకి తీసుకువస్తే ఎలా ఉంటుందనే అంశంపై ప్లాన్ చేస్తున్నారు. పంజాగుట్ట-అమీర్‌పేట రోడ్డు మార్గంలో ఇరుపక్కలా మూడు లైన్ల రహదారి ఉన్నప్పటికీ ఫుట్‌పాత్ వ్యాపారాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. వీటిని సత్యం థియేటర్ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలోకి మార్చేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ఇది అమలులోకి వస్తే పంజాగుట్ట-అమీర్‌పేట రోడ్డు పూర్తిగా ప్రజా రవాణాకు అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. అలానే అమీర్‌పేటకు వచ్చే వారికి రెండు రకాల పార్కింగ్ జోన్లకు ప్లాన్ చేస్తున్నారు. అరగంటలోపు ఉంచే వాహనాలకు ఒకరకమైన పార్కింగ్, కొన్ని గంటల వరకు ఉంచే వాహనాలకోసం మరో రకమైన పార్కింగ్ జోన్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

## జగన్‌ను జనంలోకి రాకుండా ఆపుతుందెవరు.?

ప్రభుత్వం పైన గతంలోనూ జగన్ రైతులు, విద్యార్థుల సమస్యల పైన నిరసనలకు పిలుపు ఇచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయని కారణంగా జూన్ 4న వెన్నుపోటు దినం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు నిర్వహించాలని జగన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలు పోస్టర్లు విడుదల చేసారు. అన్ని మండలా కేంద్రాల నుంచి జిల్లా స్థాయి వరకు నిరసనలు నిర్వహిస్తామని ప్రకటించారు. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా పరామర్శలకు మినహా ప్రజా సమస్యల పై జగన్ బయటకు రాలేదు. కేవలం ట్వీట్ల ద్వారా తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. పార్టీ నేతల సమావేశాల్లో ప్రభుత్వానికి వార్నింగ్ లు ఇస్తున్నారు. సంక్రాంతి నుంచే జిల్లాల పర్యటన లు.. కార్యకర్తలతో సమావేశాలు ఉంటాయని గతంలో ప్రకటించారు. ఇప్పటి వరకు అవి ఎప్పుడు మొదలవుతాయనేది స్పష్టత లేదు. వారంలో మూడు రోజులు మాత్రమే తాడేపల్లిలో అందుబాటు లో ఉంటున్నారు. ఇక, ఏడాది పూర్తయిన వేళ నిర్వహిస్తున్న వెన్నుపోటు దినం నిరసనలోనూ జగన్ పాల్గొనే అవకాశం కనిపించటం లేదు. అసలు జగన్ బయటకు వచ్చి రాష్ట్రంలో ఏ ప్రాం తంలో అయినా భారీ ధర్నా నిర్వహించాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. దీని ద్వారా పార్టీలో కొత్త జోష్ రావటంతో పాటుగా ప్రభుత్వం పైన ఒత్తిడి పెరుగుతందని విశ్లేషణ చేస్తున్నారు. జగన్ మాత్రం ఇంకా సమయం ఉందనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. 2014-19 కాలంలో ప్రతిపక్ష నేతగా జగన్ ఎంత దూకుడుగా వ్యవహరించిదీ పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. అనేక అంశాల పైన జగన్ దీక్షలు ధర్నాల్లో పాల్గొన్నారు. ప్రజలతో మమేకం అయ్యే కార్యక్రమాలు నిర్వ హించారు. ముఖ్యమంత్రి అయిన తరువాత జగన్ నేరుగా జనంతో కలిసే అవకాశం విస్మరించారు. పార్టీ కేడర్ కు అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు అధికారం కోల్పోయి ఏడాది పూర్తయింది. ఇంకా, జగన్ తాడేపల్లి - బెంగళూరుకే పరిమితం కావటం పైన పార్టీలో చర్చ జరుగుతోంది.

## ఏఎంసీలో "ధర్మం "కోసం అడుగులు




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) బోయిన్ పల్లి మార్కెట్ లో కమిటీ రోజుకో ఆలోచనతో ముందుకు పోతున్నారు.మొన్న మార్కెట్ యార్డులో మంచి నీటి సరఫరా కోసం కంటోన్మెంట్ అధికారులను కలిసి త్వరలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే! నిన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసి మార్కెట్లో చోటు చేసుకున్న మౌళిక సమస్యలు పై చర్చించారు.వీలైనంత త్వరలో కోటితో మార్కెట్లో మౌళిక సదుపాయాల రూట్ క్లియర్.ఇలా ఒకటి ఒకటిగా అన్ని ఇబ్బందులు దూరం చేస్తున్న కమిటీ.ఈ నేపథ్యంలో నిన్న శుక్రవారం ఉదయం 11: 18 నిమిషాలకు డాక్టర్.బీ.ఆర్. అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.అలాగే మార్కెట్లో మరుగున పడిన"ధర్మకాంటా"ను అందుబాటులోకి తీసుకురావాలని కమిటీ తీర్మానం చేసింది.గడిచిన ఐదేళ్లలో వేయింగ్ బ్రిడ్జి పని చేయకపోవడంతో మార్కెట్లో అందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యకు చెక్ పెట్టాలంటే వీలైనంత త్వరగా పాత దాన్నీ అందుబాటులోకి తీసుకురావాలా లేక కొత్తది దాని కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలా అనే ఆలోచనలో కమిటీ అంతర్మధనంలో పడింది.అధికారులు సూచనల మేరకు పాతది పాడైపోయింది.అందుకని నూతన ధర్మకాంటా ఏర్పాటు చేస్తే ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని అధికారులు తెలిపారు.విశ్వసనీయ సమాచారం మేరకు వేయింగ్ బ్రిడ్జి సుమారు పదహారు నుంచి ఇరవై లక్షల రూపాయలు వ్యయం ఖర్చు అవుతున్నట్లు తెలుస్తోంది.టెండర్ ప్రక్రియ ద్వారా ముందుకు పోతే ఫలితాలు ఏవిధంగా ఉంటాయో,లేక పోతే ఐదు నుంచి పది సంవత్సరాలు కాంట్రాక్టు ఇచ్చి నెల నెలా కిరాయి రూపంలో మార్కెట్ ఖాతాలో జమ వుతుంది. దీని ద్వారా ఆదాయం సమకూరుతుంది. అలాగే బోయిన్ పల్లి మార్కెట్లో భారీ వాహనాలకు ధర్మ కాంట అందుబాటులోకి రావడంతో అందరి సమస్యలు తీరుతాయని కమిటీ ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

## వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్
## 2వ రోజు శిక్షణా కార్యక్రమం

**- కోరెం, బోయినిపల్లి గ్రామాల్లో నిర్వహణ**



బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో "సంపన్న రైతు – దేశానికి గర్వకారణం" అనే లక్ష్యంతో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం మే 29 నుంచి జూన్ 12 వరకు 15 రోజుల పాటు దేశవ్యాప్తంగా నిర్వహించబడుతోంది. ఈ అభియాన్ లో భాగంగా, రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ అనుబంధ పథకాలపై నేరుగా శాస్త్రవేత్తల ద్వారా అవగాహన కల్పించబడుతోంది.ఈ శిక్షణా కార్యక్రమం 30.05.2025 (శుక్రవారం) ఉదయం కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంట, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కోరెం, బోయినిపల్లి గ్రామాల్లో నిర్వహించబడింది.ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, తాజా సాంకేతిక పరిజ్ఞానం గురించి వివరించడమే కాక, వ్యవసాయ రంగంలో అందుబాటులో ఉన్న పథకాలపై స్పష్టమైన అవగాహనను కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుండి డా. సోమశేఖర్, డా. శ్రీకాంత్, కేవికే నుండి డా. మహేష్ (విస్తరణ విభాగ శాస్త్రవేత్త),ప్రభాకర్ (ఫిషరీస్ శాస్త్రవేత్త), బోయినిపల్లి మండల వ్యవసాయ అధికారి ప్రణిత,వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మణ్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు, రైతులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## యూపీలో దారికొస్తున్న నేరస్తుల ముఠాలు

**లక్నో :** యూపీ పోలీసులు మరోసారి నేరస్థులపై తమ వైఖరిని కఠినతరం చేశారు. గత 24 గంటల్లోనే పోలీసులు 14 ఎన్‌కౌంటర్‌లు నిర్వహించారు. వీటిలో లారెన్స్ బిష్ణోయ్ ముఠాకు చెందిన ఒక పేరు మోసిన నేరస్థుడిని పోలీసులు హతమార్చగా, మిగిలిన 13 కేసుల్లో నేరస్థులను కాళ్లపై కాల్చి పట్టుకున్నారు. పోలీసుల ఈ చర్య కారణంగా నేరస్థులలో భయాందోళనలు నెలకొన్నాయి. పరిస్థితి ఎలా ఉందంటే, పదుల సంఖ్యలో నేరస్థులు చేతులు పైకెత్తి పోలీసుల ముందు లొంగిపోయారు.లారెన్స్ గ్యాంగ్ దుండగుడు నవీన్‌ను ఉత్తరప్రదేశ్ పోలీసుల ఎస్‌టిఎఫ్, ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. నవీన్ లారెన్స్ గ్యాంగ్‌లో షార్ప్ షూటర్. అతనిపై ఢిల్లీ, యుపిలో అర డజనుకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలోనే యుపి ఎస్టీఎఫ్ కు ఒక సమాచారం అందింది. ఆపై ఢిల్లీ పోలీసులతో కలిసి ఎస్టీఎఫ్ హాపూర్ లోని కొత్వాలి ప్రాంతంలో ఈ నేరస్థుడిని చుట్టుముట్టింది. ఈ సమయంలో, నవీన్ పోలీసు బృందంపై కాల్పులు జరిపాడు. కానీ అప్పటికే అప్రమత్తమైన పోలీసు బృందం ప్రతీకారం తీర్చుకుని అతన్ని చంపింది. యుపి పోలీసులు రాజధాని లక్నో నుండి ఎన్‌కౌంటర్ ప్రారంభించారు. ఇక్కడ పోలీసులకు ఒక రహస్య నేరస్థుడు కమల్ కిషోర్ గురించి ఒక సమాచారం అందింది. అతను 5 సంవత్సరాల అమాయక బాలికపై అత్యాచారం చేసి పరారీలో ఉన్నాడు. అందించిన సమాచారం ప్రకారం, మదేగంజ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో పోలీసులు అతన్ని చుట్టుముట్టడానికి ప్రయత్నించారు. ఈ సమయంలో, ఈ నేరస్థుడు పోలీసులపై కాల్పులు జరుపుతూ పారిపోయేందుకు యత్నించాడు. ఈ పరిస్థితిలో, పోలీసులు కూడా ప్రతీకార కాల్పులు జరిపి అతన్ని పట్టుకున్నారు. సీతాపూర్ జిల్లాలోని కామియాపూర్ నివాసి అయిన ఈ నేరస్థుడు ఇక్కడి ఆనకట్ట సమీపంలోని మురికివాడల్లో నివసిస్తున్నాడు. మరోవైపు, ఘజియాబాద్ పోలీసులు ముఖాముఖి ఎన్‌కౌంటర్‌లో పేరుమోసిన దొంగను కూడా పట్టుకున్నారు.జలౌన్ నేరస్థులలో పోలీసుల భయం కనిపించింది. ఇక్కడ కొంచ్‌లోని నవీన్ జ్యువెలర్స్ దుకాణంలో దోపిడీకి పాల్పడిన ఇద్దరు నేరస్థులను పోలీసులు చుట్టుముట్టారు. పోలీసులు ఈ నేరస్థులను లొంగిపోవాలని కోరారు. కానీ రాజేంద్ర కుష్వాహా కుమారుడు గోలు అలియాస్ అజయ్ కుష్వాహా అనే నేరస్థుడు పోలీసులపై కాల్పులు జరిపాడు. అటువంటి పరిస్థితిలో, పోలీసులు కూడా కాల్పులు జరిపారు. అయితే అజయ్ కాలిపై తూటా దిగింది. అతనిపై కాల్పులు జరపడం చూసి, అతని స్నేహితుడు రాము కుష్వాహా వణికిపోయాడు. అతనే చేతులు పైకెత్తి లొంగిపోయాడు.యుపి పోలీసుల అనేక ఇతర జిల్లాల్లో ఎన్‌కౌంటర్ కు పాల్పడ్డారు. ఉన్నావ్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పోలీసులు ఒక నేరస్థుడిని అరెస్టు చేశారు. అయితే మరో ఇద్దరు నేరస్థులు తప్పించుకోగలిగారు. అదేవిధంగా, బులంద్‌షహర్‌లో, 6 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడిని ఖుర్జా దేహత్ పోలీసులు ఎన్‌కౌంటర్ సమయంలో అరెస్టు చేశారు. బాగ్‌పత్ పోలీసులు ఇద్దరు చైన్ స్నాచర్లను అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి, ఆగ్రా పోలీసులు ఒక నేరస్థుడిని కాలిపై కాల్చి పట్టుకున్నారు. మరోవైపు, ఝాన్సీలో, మాత్ కొత్వాలి పోలీసులు రూ. 25,000 బహుమతిని ప్రకటించిన నేరస్థుడిని ఎదుర్కొన్నారు. అదే సమయంలో, బల్లియా పోలీసులు ఒక గంట వ్యవధిలో రెండు ఎన్‌కౌంటర్లలో ఇద్దరు నేరస్థులను అరెస్టు చేశారు.సహారన్‌పూర్ భట్టా మునిమ్‌ను దోచుకున్న దుండగులను ఉత్తరప్రదేశ్‌లోని షామ్లి యూనిట్ పోలీసులు ఎన్‌కౌంటర్‌లో పట్టుకున్నారు. ఇదిలా ఉండగా, ఎన్‌కౌంటర్ సమయంలో హాపూర్ పోలీసులు నలుగురు దుండగులను అరెస్టు చేశారు. నేరస్థులలో ఒకరి కాలులో బుల్లెట్ దిగింది. కాగా, మరో నేరస్థుడు కాల్చి చంపారన్న భయంతో లొంగిపోయాడు. మరోవైపు, ముజఫర్ నగర్‌లో, పోలీసులు ముగ్గురు దుండగులను కాలిపై కాల్చి అరెస్టు చేశారు. అదే క్రమంలో, లక్నోలోని అలంబాగ్ పోలీసులు ఎన్‌కౌంటర్‌లో ఒక నేరస్థుడిని అరెస్టు చేశారు.

# శ్రీ అంకమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**- ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధారా రమేష్**

**- రాఘవపురంలో ఘనంగా ప్రారంభమైన శ్రీ అంకమ్మ మహాలక్ష్మమ్మ జాతర**

**- తరతరాలుగా అమ్మవారికి గద్దె బండారి సమర్పిస్తున్న ధారా రమేష్ వంశస్తులు**





సుజాతనగర్ (ప్రశ్న న్యూస్) ఎంతో మహిమ శక్తులు కలిగిన కోరిన కోర్కెలు తీర్చే శ్రీ అంకమ్మ మహాలక్ష్మమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని, తల్లి చల్లని దయతో ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధారా రమేష్ ఆకాంక్షించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం రాఘవాపురం గ్రామం నందు వేంచేసి ఉన్న శ్రీ అంకమ్మ మహాలక్ష్మమ్మ జాతర మహెూత్సవం ఘనంగా ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు దారా రమేష్ దంపతులు తరతరాల నుంచి వస్తున్న దారా వారి వంశం 150 సంవత్సరాల చరిత్ర గల ఆనవాయితీ ప్రకారం గద్దె, అమ్మవారికి బండారి సమర్పించడం జరిగినది. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో దారా రమేష్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దారా రమేష్ మాట్లాడుతూ ఎంతో మహిమ కలిగిన శ్రీ అంకమ్మ మహాలక్ష్మమ్మ అమ్మ వారికి వంశ పారంపర్యంగా తమ దారా కుటుంబం నుండి గద్దె, బండారి సమర్పించే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని, అమ్మ వారి చల్లని చూపునకు ప్రతి ఒక్కరూ పాత్రులు కావాలని కోరారు. ఎంతో వైభవంగా ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దారా రమేష్ దంపతులు, కుమారుడు దారా ధీరజ్, ఆలయ అర్చకులు జనార్ధన్, ఆలయ కమిటీ సభ్యులు వెంకట నారాయణ, సాంబయ్య, చిన్నరాములు, నాగార్జున, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్ ప్రదానోత్సవం




స్వర్గీయ నందమూరి తారకరామారావు 102వ జయంతి ని పురస్కరించుకొని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సమర్పణలో ప్రముఖ సంస్థ కళావేదిక నిర్వహణలో జరిగిన సి బి జె కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్ కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్ లో అంగరంగ వైభవంగా జరిగింది. సీనియర్ నిర్మాత శ్రీ ఆర్వీ రమణమూర్తి గారి ఆశయ సాధన అహర్నిశలు శ్రమిస్తున్న భువన రాయవరపు సారథ్యంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఈ ఏడాది ప్రత్యేకంగా రియల్ హీరోస్ ని సత్కరించే ఎన్టీఆర్ దేశ్ రక్షక్ అవార్డులను త్రివిధ దళాలకు చెందిన సైనిక అధికారులకు అందజేశారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో అత్యంత ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన సైనిక అధికారులకు పురస్కారాల ప్రధానం జరిగింది. మేజర్ జనరల్ ఎన్ ఎస్ రావు, మేజర్ భరత్, గ్రూప్ కెప్టెన్ పి ఆర్ ప్రసాద్, కెప్టెన్ టి ఎన్ సాయికుమార్ లు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎన్టీఆర్ దేశ రక్షక్ అవార్డులను విశిష్ట అతిధుల చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే కళావేదిక సంస్థ అందిస్తున్న ఎన్టీఆర్ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డులను సీనియర్ నిర్మాతలు శ్రీమతి ఎన్ఆర్ అనురాధ, శ్రీ చదలవాడ శ్రీనివాసరావు లు అందుకున్నారు. ఈ సందర్భంగా కళావేదిక సంస్థ రూపొందించిన నట సార్వభౌముడు ప్రత్యేక సంచిక ను అతిధుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ అవార్డుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్టీఆర్ తనయుడు ప్రముఖ సినిమాటోగ్రాఫర్ శ్రీ నందమూరి మోహనకృష్ణ మాట్లాడుతూ.. విశ్వవిఖ్యాత నటుడికి కొడుకుగా పుట్టడం తన అదృష్టమని పేద రైతు కుటుంబంలో నుంచి వచ్చి ప్రపంచంలో అద్వితీయ నాయకుడిగా ఎదిగి ముఖ్యమంత్రి స్థానంలో నిలబడటం అరుదైన విషయమని ఆయన అన్నారు. సినీ నటుడు గా ఉన్నప్పుడే ఆయన ప్రజల కోసం తపన పడి యావత్ ప్రజలను ఒక తాటిపై నిలిపి సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయం అన్నారు. కరువు వచ్చిన.. తుఫాను వచ్చినా.. యుద్ధం వచ్చిన తనతో పాటు ప్రజలను కదిలించి నిధులు సేకరించి ప్రభుత్వానికి అందజేసిన ఘనత స్వర్గీయ ఎన్టీఆర్ దేనని ఆయన అన్నారు. ఈరోజు మనం మాట్లాడుకుంటున్న సంక్షేమ పథకాల రూపకర్త శ్రీ ఎన్టీఆరే అని కొనియాడారు. అలాంటి మహానుభావుడికి నివాళి గా ఇంత గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించడం, రియల్ హీరోస్ అయినా సైనికాధికారులు సత్కరించడం మామూలు విషయం కాదని కళావేదిక నిర్వాహకురాలు భువన రాయవరపు అభినందనీయురాలని ప్రశంసించారు. మరో అతిధి నిర్మాత, ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రధాని కార్యదర్శి టి. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ సైనిక అధికారులను సత్కరించాలన్న ఆలోచన చాలా గొప్పదని అలాంటి గొప్ప కార్యక్రమం చేసిన ఆర్వీఆర్ తనయ భువన ఒక గొప్ప సంప్రదాయానికి శ్రీకారం చుట్టిందని అభినందించారు. ఈరోజు ప్రస్తావిస్తున్న పాన్ ఇండియా చిత్రానికి ఆరోజే పాతాళభైరవి తో ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని వరుస మూడు హిందీ చిత్రాలు విడుదల తర్వాత హిందీలో ఎన్నో అవకాశాలు వచ్చినప్పటికి వాటన్నిటిని సున్నితంగా తిరస్కరించి తెలుగు చిత్రాలకే పరిమితమై తెలుగుపై మమకారాన్ని చాటిని గొప్ప వ్యక్తే ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. అలాగే దేశంలో అత్యధిక పారితోషకాన్ని తొలిసారి అందుకున్న సార్వభౌముడు ఆయనేనని చెప్పారు. ప్రాంతీయ పార్టీలతో కలిసి కేంద్రంలో అధికారాన్ని చేపట్టే విధంగా ఫెడరల్ ఫ్రంట్ కు రూపకల్పన చేసి ముందుకు నడిపిన ఘనత ఆ మహనీయునిదేనని ఆయన అన్నారు. అలాంటి మహానుభావులకు జననమే గాని మరణం ఉండదని ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. కళావేదిక ఎన్టీఆర్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత సీనియర్ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒకప్పుడు మద్రాసి గా పిలవబడే తెలుగు వారికి ఒక గుర్తింపు తెచ్చిన మహానటుడు, నాయకుడు శ్రీ ఎన్టీఆర్ అన్నారు హైదరాబాదు లో పురుడు పోసుకున్న తెలుగుదేశం పార్టీకి ఆంధ్రప్రాంతంలో 95శాతం సీట్లు వస్తే తెలంగాణలో నూటికి నూరు శాతం సీట్లు సాధించిందని తెలిపారు. రామారావు గారి వల్లే ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారికి ఒక గొప్ప గుర్తింపు లభించిందని ఈరోజు ఆయన పేరు మీదుగా పురస్కారాలను ప్రతిభ గలవారికి అందజేయడం చాలా గొప్ప విషయం అన్నారు. నటుడు మాదాల రవి తన ప్రసంగంలో ఎన్టీఆర్ కేవలం నటుడిగా మాత్రమే ప్రజల గుండెల్లో నిలిచిపోకుండా సేవలతో రాజకీయాల ద్వారా ప్రజలకు చేరువైన ఏకైక నటుడు అని కొనియాడారు. బడుగు బలహీన తాడిత పీడిత జనాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ నిర్మాత అనురాధాదేవి, ఎన్టీఆర్ మనమరాళ్లు నందమూరి మోహన రూప, శ్రీమతి కే శ్రీమంతిని, నటుడు పృథ్వీరాజ్ కార్యక్రమాన్ని నిర్వహకురాలు భువన రాయవరపు దర్శకుడు ముప్పలనేని శివ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జీవిత విశేషాలు తో పాటు 52 సంవత్సరాల పాటు కళావేదిక చేస్తున్న కార్యక్రమాల వివరాలు అభినందన, నీరాజనం, సాయి మహిమలు, చిత్రాలు నిర్మించిన ఆర్వీ రమణమూర్తి గారి జీవిత విశేషాలు తో కూడిన కళావేదిక ప్రస్థానంపై ప్రదర్శించిన ఫిలిమ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆలపించిన పాటలు రమణీయంగా సాగాయి ప్రసంగాల అనంతరం 2024లో విడుదలైన చిత్రాలలో ప్రతిభ కనబరిచిన నటీనటులకు సాంకేతిక నిపుణులకు, సోషల్ మీడియా ప్రముఖులకు అతిధుల చేతుల మీదుగా అవార్డులు అందజేశారు.

## విజయనగరంలోని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం
# రామనారాయణంలో యోగాంధ్ర



**విజయనగరం :** పర్యాటక ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా జిల్లాలోని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో శుక్రవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ క్షేత్రంలో కొలువుదీరిన రామనారాయణుని పాదాల చెంత రామధనుస్సు ఆకృతిలో రాష్ట్ర మంత్రి శ్రీ కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ సహా సుమారు 1500 మంది ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, పరిసర గ్రామాల ప్రజలు భక్తి ప్రపత్తులతో యోగాసనాలు వేశారు. ఉదయాన్నే ఏడు గంటలకు పెద్ద ఎత్తున ప్రజలు, యోగ పట్ల ఆసక్తి గల వారంతా తెల్లని దుస్తులు ధరించి యోగాంధ్ర కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు ప్రదర్శించారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగ గురువులు డా.ఆరిశెట్టి ఇందుమతి, ఆరి సుందరశివరావులు కార్యక్రమంలో పాల్గొన్న అందరితో సుమారు 45 నిముషాల పాటు పలు యోగసనాలు వేయించారు. యోగాసనాల ప్రదర్శన అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ రామనారాయణ దర్శనాన్ని కల్పించడంతోపాటు తీర్థ ప్రసాదాలను ఎన్.సి.ఎస్.ట్రస్టు ఆధ్వర్యంలో అందజేశారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జె.సి. సేతుమాధవన్, డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్టు డైరక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, పర్యాటక అధికారి కుమారస్వామి, డి.ఎస్.డి.ఓ. వెంకటేశ్వరరావు, డి.ఎం.హెచ్.ఓ. జీవనరాణి, ఆయుష్ అధికారి ఆనందరావు తదితరులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ తదితరులను ఎన్.సి.ఎస్.ట్రస్టు ప్రతినిధులు దుశ్శాలువతో సత్కరించారు. తొలుత యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగ ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసే ఉద్దేశ్యంతో ఈనెలను యోగ మాసంగా ప్రకటించి అన్ని ప్రాంతాల్లో యోగ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. యోగ మన పూర్వీకులు మనకు అందించిన గొప్ప ఆస్తి అని పేర్కొంటూ దీనిని సాధన చేయడం ద్వారా మన శరీరాన్ని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంలో శ్రద్ధ తీసుకోవడంలో ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించడం దీని లక్ష్యమని చెప్పారు. జూన్ 21న అంతర్జాతీయ దినోత్సవంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడి విశాఖ వస్తున్నారని ఆరోజున రాష్ట్రమంతటా ప్రతి గ్రామంలో యీ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా ప్రపంచానికి యోగ విశిష్టతను తెలియజేసే ఉద్దేశ్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలరోజుల యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నాలుగు పర్యాటక ప్రదేశాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నామని మొదటగా రామనారాయణంలో నేడు యోగాసనాల ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. జూన్ నెలలో చింతపల్లి బీచ్, రామతీర్థం, తాటిపూడి రిజర్వాయరు తదితర ప్రదేశాల్లోనూ యోగాంధ్రలో భాగంగా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. జూన్ 10వ తేదీన జిల్లాకు చెందిన 5 వేల మంది ఉపాధి పథకం వేతనదారులతో యోగాసనాలు ప్రదర్శించే కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ కోసం జీవితంలో యోగను భాగంగా చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ మాట్లాడుతూ నెలరోజుల యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లాలో 7.8 లక్షల మందిని భాగస్వాములను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో యోగపై వివిధ వర్గాల వారికి పలు అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్.సి.ఎస్.ట్రస్టు ప్రతినిధులు చంద్రకళ, రామనారాయణం మేనేజర్ శ్రీనివాసరావు, ఆయుష్ జిల్లా అధికారి డా.బి.వరప్రసాద్, యోగాంధ్ర ప్రత్యేక అధికారి ఎం.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అమర్ నాథ్ రెడ్డి ను కలసిన :డిసిసిబీ చైర్మన్



పలమనేరు(ప్రశ్న న్యూస్) పట్టణ ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని చిత్తూరు జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. డిసిసిబీ చైర్మన్ గా నియమితులు కావడంతో సీఈవో సి.శంకర్ బాబుతో కలసి శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అమరనాథ రెడ్డిని కలసి ధన్యవాదాలు తెలియజేస్తూ పుష్పగుచ్చం అందించి శాలువాలతో సత్కరించారు. త్వరలో జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేయాలని ఈ సందర్బంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సిబ్బంది గంగిరెడ్డి,యువశేఖర్, హరిప్రసాద్, టీడీపీ పార్లమెంటరి యువత సెక్రటరీ డిల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే కు డీలర్ల సన్మానం

పలమనేరు పట్టణ రేషన్ డీలర్లు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం కలసి సన్మానించారు. ఎండియు, (మొబైల్ డిస్పెన్సరి యూనిట్) వాహనాలను తొలగించి రేషన్ సరుకుల పంపిణిని డీలర్లు చేపట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని హర్షిస్తూ ఎమ్మెల్యేను కలసి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజలకు ఏమాత్రం ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం డీలర్లపై నమ్మకానికి అనుగుణంగా పారదర్శకంగా నిత్యావసరల పంపిణి చేపట్టాలని ఈ సందర్బంగా ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘ నాయకులు నరేంద్ర కుమార్, ముని కృష్ణయ్య, సనాఉల్లా, జుబేర్, జిలాని, రాజేష్ తదితరులున్నారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు మరో మూడు నెలల పొడిగింపు



నంద్యాల( ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో 3 నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా కలెక్టర్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ జి. రాజకుమారి తెలిపారు. గతంలో రెన్యువల్ చేసిన అక్రిడేషన్ కాల పరిమితి మే 31వ తేదీ నాటికి ముగుస్తున్న నేపథ్యంలో మీడియా అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మరో మూడు నెలలు జూన్ 1, 2025 నుండి ఆగష్టు 31, 2025 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు.

## దళిత జాతి ముద్దుబిడ్డ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు మంత్రిపదవి కేటాయించాలి

- 30 ఏళ్ల సేవలకు గుర్తింపుగా మంత్రి పదవి కేటాయించాలి
- ఎస్సీ,ఎస్టీ ఉప సర్పంచుల ఫోరం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షులు బీ బండపల్లి అంజన్ కుమార్



కొడిమ్యాల,(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో దళితుల హక్కుల కోసం పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎస్సీ-ఎస్టీ ఉపసర్పంచుల పోరాట సమితి మాజీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు,సాయి హర్షిణి ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ బండపల్లి అంజన్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు.జగిత్యాల జిల్లా,ధర్మపురి నియోజకవర్గం శాసనసభ్యులు,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, కాంగ్రెస్ పార్టీకి మూడు దశాబ్దాలుగా విశేష సేవలు అందించిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా అంజన్ కుమార్ మాట్లాడుతూ దళిత జాతి ముద్దుబిడ్డ లక్ష్మణ్ కుమార్ గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కష్టకాలాల్లో ఉన్నప్పటికీ, ఎలాంటి ఫిరాయింపులకు పాల్పడకుండా పార్టీకి అంకితంగా సేవలందించారని అంజన్ కుమార్ గుర్తు చేశారు. ఆయన జడ్పీటీసీగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గా, ప్రస్తుతం ధర్మపురి ఎమ్మెల్యేగా ప్రజాసేవలు చేస్తున్నారని పేర్కొన్నారు."ఇలాంటి నిబద్ధత గల నేతకు జగిత్యాల జిల్లా తరఫున మంత్రి పదవి ఇవ్వడం దళిత సమాజానికి గౌరవంగా ఉంటుంది. మాదిగ వర్గానికి న్యాయం చేయాలని కోరుతున్నాం" అని తెలిపారు.ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆశయరూపంగా విజ్ఞప్తి చేస్తున్నట్లు బండపల్లి అంజన్ కుమార్ వెల్లడించారు.

## నాచారం లో ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు




నాచారం(ప్రశ్న న్యూస్) రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలను నాచారంలో ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో సాధన మానసిక దివ్యాంగుల కేంద్రంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులకు భోజనంతోపాటు పాటు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నారని కొనియాడారు.నాడు తెలంగాణ బిల్లును అసెంబ్లీలో మొట్టమొదటిసారి ప్రవేశపెట్టి అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం కోసం నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష మేరకు తన మంత్రి పదవిని కూడా త్యాగం చేసినటువంటి మహోన్నతమైన నాయకుడు శ్రీధర్ బాబు అని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రానికి ఐటీ మంత్రిగా విదేశాల నుండి అనేకమైన పెట్టుబడులు తీసుకొస్తూ ఈ దేశానికే తెలంగాణ రాష్ట్రాన్ని రోల్ మోడల్ గా నిలిచే విధంగా పనిచేస్తున్నారని అన్నారు. ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్లు కలకాలం జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఎస్ ఎస్ ఎస్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# చివరి శ్వాస వరకు ప్రజల సేవే ధ్యేయం

- ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల స్వప్నాలకు సాకారం
- రూ.43 కోట్లతో నారాయణపూర్ పనులకు ఊపు
- గంగాధర మండలంలో 721 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు
- రుణ మాఫీ,ఉచిత విద్యుత్,మహిళా ఉచిత ప్రయాణం - ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ
- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం





**బోయినపల్లి, (ప్రశ్న న్యూస్)** చొప్పదండి నియోజకవర్గంలో ప్రతి అర్హులకి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రకటించారు. గంగాధర మండలంలోని 33 గ్రామాలకు చెందిన 721 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు శుక్రవారం పంపిణీ చేశారు.కరీంనగర్ జిల్లా కలెక్టర్ ప్రమేలా సత్పతితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం సంకల్పితంగా పేదవారి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లను నిర్మించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో గంగాధర మండలంలోనే 721 మంది అర్హులకు ఇండ్లు మంజూరయ్యాయని వెల్లడించారు.

### - సంక్షేమ పథకాల్లో అవినీతి లేని పాలన

బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం హయాంలో పార్టీ కార్యకర్తలకే పథకాలు పరిమితమయ్యాయని విమర్శించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హతే ప్రమాణంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. "ఎవరైనా పథకాల పేరుతో డబ్బులు అడిగితే, వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలి. లేకపోతే పోలీసులకు ఫిర్యాదు చేయండి," అని ప్రజలకు సూచించారు.

### - రుణమాఫీ,ఉచిత సేవల ద్వారా భారీ ఊరటనిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్రంలో 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసి 99 శాతం రైతులకు ఉపశమనాన్ని అందించామని తెలిపారు.గంగాధర మండలంలోనే 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.17.82 కోట్లు మాఫీ చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.48 కోట్లు మాఫీ చేసిందని వివరించారు.

"మహాలక్ష్మి పథకం" ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, "జ్యోతి పథకం" ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రజలకు తక్షణ లబ్ధిని అందించాయని పేర్కొన్నారు.

### - అభివృద్ధి పనులకు కొత్త ఊపు

20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నారాయణపూర్ రిజర్వాయర్ పనులను రూ.43 కోట్లతో పూర్తిచేయనున్నట్లు వెల్లడించారు. సాగునీటి ప్రాజెక్టులన్నింటిని పూర్తిచేసి నియోజకవర్గాన్ని కోనసీమగా అభివృద్ధి చేస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు వంటి విద్యా అభివృద్ధి కార్యక్రమాలు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే 56 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం గుర్తు చేశారు.

## మారేడు పల్లి పార్కులో సీసీ కెమెరాలు: ఎమ్మెల్యే.



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) పార్టీకి కార్యకర్తలే అధినేతలు, డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రతి నిత్యం ఫోకస్ చేస్తూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువస్తూ సమస్యలు పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్న నేతలకు నా ప్రత్యేకఅభినందనలన్నారు . సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రతి నాయకుడు ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలు తెలుసుకోవాలి,అప్పుడే వారి మనస్సు గెలుచుకున్నా వారౌతారు.అలాగేనియోజకవర్గంలోని మోండా మార్కెట్ డివిజన్,వెస్ట్ మారేడ్ పల్లి పరిధిలోని నెహ్రూ నగర్ పార్క్లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్ యాదవ్ సొంత నిధులతో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి నిన్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తో ప్రారంభోత్సవం చేయించారు.అనంతరం కాలనీ వాసులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయం అంటే కేవలం ఎన్నికలకు మాత్రమే పరిమితమని,నేను, నాతో ఉన్న నాయకులు కేవలం ప్రజల సేవకే ప్రాధాన్యం ఇస్తామని,అభివృద్ధి విషయంలో రాజకీయాలకు జోక్యం లేదని,కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధే నా లక్ష్యమని, ముఖ్యంగా నియోజకవర్గానికి తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిధులు మంజూరు చేయించి, రిజర్వాయర్లు నిర్మించడం, అలాగే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన సంతోష్ యాదవ్ ని మనస్పూర్తిగా అభినందిస్తున్నాని,కాలనీ వాసులు కూడా అభివృద్ధి చేసే నాయకులనే ఆశీర్వదించాలని కోరారు.ఎప్పుడో ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో కన్పించే వ్యక్తులకు పట్టం కడుతే కన్నీళ్లు తప్పా మరేమీ ఉండదు. అందుకనే నిత్యం ప్రజలతో మమేకమైన, వారి బాగోగులు చూసుకునే వారే నిజమైన నాయకులు. అలాగే సంతోష్ యాదవ్ దంపతులు పెళ్లి రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు ఎమ్మెల్యే శ్రీ గణేష్. మోండా డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాట్లాడుతూ గత కొన్ని రోజుల క్రితం స్థానిక కాలనీ వాసులు చాచా నెహ్రూ మున్సిపల్ పార్కులో గుర్తు తెలియని వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని పార్క్ లో "సీసీ కెమెరాలు లేకపోవడంతో వారి అరాచకాలు ఎక్కువైయ్యాని వాటిని అరికట్టాలంటే నిఘా నేత్రాలు ఏర్పాటు చేయ్యండని కోరడంతో సొంత నిధులతో నాలుగు సీసీ కెమెరాలు కాలనీ వాసులకు అందజేయడం జరిగిందన్నారు సంతోష్ యాదవ్.ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, విఠలేశ్వర స్వామి టెంపుల్ ఛైర్మన్ గౌరీ శంకర్, డివిజన్ కాంగ్రెస్ మహిళా నాయకులు వైష్ణవి, నాగేష్యాదవ్, నందికంటి రవి బాబూరావు, వెంకట్రాజు, బాబూరావు ముదిరాజ్, దేవేందర్ ,పంగ రాజయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీర్ల అయిలయ్య.. నీ పద్దతి మార్చుకో

**-కేసీఆర్, కేటీఆర్లపై విమర్శించే సహించేదిలేదు**

**బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య కురుమ**



యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నీ పద్దతి మార్చుకో.. మాటిమాటికి రాష్ట్ర తొలిసీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించే సహించేది లేదని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు, కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు కర్రె వెంకటయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని మీడియా సమావేశంలో మాట్లాడారు కేసీఆర్, కేటీఆర్పై స్థాయిని మించి మాట్లాడితే మంత్రి పదవిని వస్తుందని భ్రమలో ఉన్నావని అన్నారు. రాష్ట్రంలో ఎంతో మంది కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు లేని అత్యుత్సాహం ప్రదర్శించి మాట్లాడుతున్నావని తెలిపారు. కవిత మాటలను వక్రీకరించి మాట్లాడటం సరైంది కాదన్నారు. కేసీఆర్ కుటుంబం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. వ్యక్తిగత దూషణలు చేస్తే బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఆలేరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి మాట్లాడాలని అన్నారు. అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానికి ఒక్కరూపాయి కేటాయించలేదన్నారు. దమ్మింటే గుట్ట అభివృద్ధికి నిధులను తీసుకురావాలన్నారు. ఆలేరులో ఎన్నో సమస్యలున్నాయని ఇప్పటి వరకు అభివృద్ధి శూన్యమన్నారు. ఆలేరు నియోజకవర్గంలో కేవలం స్వంత గ్రామమైన సైదాపురం గ్రామానికే వందశాతం రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను మంజూరు చేశావని, ఇప్పటి వరకు నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు పథకాలను ఎందుకు వంద శాతం అమలు చేయలేకపోతున్నావో చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆలేరు అభివృద్ధిపై దృష్టి సారించకపోగా ప్రశ్నించిన ప్రతిపక్షం నాయకులకు విమర్శిస్తూ కాలయాపన చేస్తున్నావన్నారు. ఇప్పటికైన బుద్ధి తెచ్చుకుని స్థాయిని మించి విమర్శించే పనులు మానీ అభివృద్ధి పై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుణగంటి బాబురావుగౌడ్, శారాజీ రాజేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ కు సన్మానాలు



మేడ్చల్( ప్రశ్న న్యూస్) ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ గా నియామకమైన నిత్యానందను కాంగ్రెస్ నేతలు ఘనంగా సన్మానించారు. మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోమారం రమణారెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్ నిత్యానందను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, ఎన్ ఎస్ సి ఐ స్టేట్ జనరల్ సెక్రెటరీ మామిండ్ల రాహుల్ యాదవ్, మురళి గౌడ్, మైనార్టీ మండల అధ్యక్షులు పాషా, రాజ బొల్లారం మాజీ సర్పంచ్ నారాయణ గౌడ్, వెంకటేష్ గౌడ్ సురేష్ మహేందర్ నగేష్ గౌడ్, నరేష్, జనగాం నాగరాజు గౌడ్ మేడ్చల్ మండల యూత్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు. ఇదేవిధంగా రాజ బొల్లారం పాషా టీం ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ ను ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట నాగరాజు, మాజీ సర్పంచ్ డి నారాయణ గౌడ్, వెంకటేష్ సురేష్, నగేష్ గౌడ్ మహేందర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవే మా లక్ష్యం

**శ్రీ ఆంజనేయ స్వామి అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గా బి బాలరాజు గౌడ్**




ఘటకేస్కర్ (ప్రశ్న న్యూస్) ఘట్కేసర్ లోని అన్నోజిగూడలో కొలువైన శ్రీ ఆంజనేయ స్వామి అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయం చారిటబుల్ ట్రస్ట్ నూతన చైర్మన్ గా బాలగౌని బాలరాజు గౌడ్ జనరల్ సెక్రటరీగా బాలగౌని వెంకటేష్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీ ఆంజనేయ స్వామి అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయం ఘట్కేసర్ అన్నోజిగూడ ప్రజలను కాపాడుతున్నారని చైర్మన్ బి బాలరాజు గౌడ్ అన్నారు అలాంటి భగవంతుడి సేవలు ట్రస్ట్ గా మారి మునుముందు ప్రజలను భగవంతుడినీ మరింత దగ్గర చేసేందుకే ట్రస్ట్ గా ఏర్పాటు చేశామని వివరించారు. ఈ (శ్రీ ఆంజనేయ స్వామి అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయం చారిటబుల్ ట్రస్ట్) లో 9 మంది సభ్యులుగాను ఒకరు చైర్మన్ గాను, ఒకరు వైస్ చైర్మన్ గా ఒకరు సెక్రటరీ ఒకరు ట్రెజరర్ ఒకరు జాయింట్ సెక్రెటరీలు గా రెండు సంవత్సరాల వరకు విధులు నిర్వహిస్తారు. ఈ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు విద్య వైద్యం అందించాలని అలాగే వృద్ధాప్యంలో రోడ్డున పడ్డ వృద్ధులకు తోడుగా నీడగా ఉండాలని చిన్ని ప్రయతమన్నారు. హిందూ బంధువులందరికీ సనాతన ధర్మం, ఉపనయనాలు, వేద గ్రంధాలు , ఆధ్యాత్మిక పుస్తకాలు ట్రస్టులో అందుబాటులోకి తీసుకొచ్చి మన పురాతన ధర్మం పై అవగాహన కల్పిస్తామని, సామాజిక ఆధ్యాత్మిక మరియు పురాతన వైద్య విధానాలపై యువతకి అవగాహన కల్పిస్తూ సమాజంలో మార్పు తేవడానికి ఈ ట్రస్ట్ (శ్రీ ఆంజనేయ స్వామి అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయం చారిటబుల్ ట్రస్ట్) దోహదపడేలా చూస్తామన్నారు. ట్రస్ట్ ఆదాయాన్ని ట్రస్ట్ ఆధ్వర్యంలో దేవాలయం యొక్క మరమ్మతులు అభివృద్ధి పనులు అలానే సమాజంలో భగవంతుడిపై సమాజంపై ప్రేమాభిమానాలను నింపుతూ మంచి బాటలో ఆధ్యాత్మికతతో నడిచే విధంగా సమాజాన్ని నడిపిస్తూ అభివృద్ధి పనులలో ముందుంటారని తెలియజేశారు.

## సొంత ఇల్లు ప్రతీ పేద ప్రజల చిరకాల వాంఛ

- సొంతిల్లు కల నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- 21 వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి : కోయల్కార్ మస్తాన్
- 21 వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ మున్సిపల్ పరిధిలోని 21 వ వార్డులో శుక్రవారం స్థానిక వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోయల్కార్ మస్తాన్ లబ్ధిదారు పూదరి సుగుణ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమిపూజ నిర్వహించి, శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పేదవాడి చిరకాల వాంఛ సొంత ఇల్లు అని,అలాంటి పేదల కలలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం "ఇందిరమ్మ ఇల్లు" పేరిట సాకారం చేస్తోందని, సదరు లబ్ధిదారు సుగుణ కు ఇల్లు మంజూరు చేసిన స్థానిక ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎం రేవంత్ రెడ్డి లకు ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

## శ్రీధర్ బాబు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసిన.

# జిల్లా అధ్యక్షులు నల్మాస్ ప్రభాకర్



మంథని( ప్రశ్న న్యూస్) మంథని మున్సిపల్ పరిధిలోని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంథని పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కేక్ కట్ చేసి కార్మికులకు మహిళలకు చీరలు మగవాళ్లకు లుంగీలు, టవల్స్ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నల్మాస్ ప్రభాకర్ గారి ఆధ్వర్యంలో చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ ల్లంకి లింగమూర్తి డివిజన్ చైర్మన్ ముస్తాల దామోదర్ పట్టణ సంఘం గౌరవ అధ్యక్షులు ఒల్లాల సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి కేశెట్టిరమేష్ కోశాధికారి రావికంటి మనోహర్ ఆలయ చైర్మన్ కొత్త శ్రీనివాస్ ఇంకా రావికంటి సదానందం ఒల్లాల నాగరాజు రాచర్ల నాగరాజు కొమురవెల్లి సత్యనారాయణ రావికంటి చంద్రమౌళి మేఘశ్యామ్ కొంచెం వెంకటేశ్వర్లు కొమురవెల్లి రాజు ఎల్లంకి కేదారి ఎల్లంకి ప్రభాకర్ అధిక సంఖ్యలో వైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బోయినిపల్లి మండలంలో

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు శ్రీకారం



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు శుక్రవారం బోయినిపల్లి మండలంలోని కోరెం, బూరుగుపల్లి,తడగొండ గ్రామాల్లో భూమిపూజ కార్యక్రమాలను మండల అభివృద్ధి అధికారి భీమా జయశీలతో కలిసి స్థానిక మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమక్షంలో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల లబ్ధిదారులు పాల్గొని భూమిపూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భీమా జయశీల, వ్యవసాయ మార్కెట్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేశ్ యాదవ్, బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, తడగొండ మాజీ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్,మండల కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్,సత్తయ్య, నర్సయ్య,వెంకటేష్, అంజయ్య,లక్ష్మణ్,కేశవరెడ్డి, రఫిక్,మండల నరేష్,గుడి శ్రీనివాసరెడ్డి,ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అధికారులు,హౌసింగ్ శాఖ ఏఈ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుడి రాజశేఖర్ రెడ్డి,ఆయా గ్రామాల ప్రజలు,తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి స్థిర నివాస కల కల్పించాలన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యం మరో అడుగు ముందుకు వేసిందని హాజరైన కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## షరతులు లేకుండా

# రాజీవ్ యువ వికాసం అమలు చేయాలి

**- లావుడ్యా సత్యనారాయణ నాయక్**

**లబ్ధిదారుల సంఖ్య కుదింపు కుట్రలు ఆపాలి**



కొత్తగూడెం ఆర్సీ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకై యువతి యువకులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎలాంటి షరతులు లేకుండా అమలు చెయ్యాలని సుజాతనగర్ మండల ప్రధాన కార్యదర్శి లావుడ్యా సత్యనారాయణ నాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు కేవలం ప్రజలను మభ్య పెట్టె విధంగా ఉన్నాయని ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. నిరుద్యోగ యువతి, యువకుల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమలులో కూడా క్లారిటీ లేదని, ఓ వైపు సిబిల్ స్కోర్ కు సంబంధం లేదంటూనే మరో వైపు సిబిల్ స్కోర్ ఉన్నవారినే అర్హులుగా ఎంపిక చేశారన్నారు. ఇంటర్వ్యూల పేరుతో ప్రభుత్వం కాలయాపనా చేస్తూ యువతను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. పథకం అమలు కూడా దశల వారీగా ఉంటుందనే ప్రచారం నడుస్తున్న తరుణంలో స్పష్టమైన విధి విధానాలు ప్రకటించి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రకటించిన రుణ పరిమితికీ తగ్గట్టుగా సబ్సిడీ రుణాలు అందించాలని బిఆర్ఎస్ పార్టీ సుజాతనగర్ మండల ప్రధాన కార్యదర్శి లావుడ్యా సత్యనారాయణ నాయక్ అన్నారు. లేనియెడల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి నిర్వహిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు.

# సామాన్యుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

**- ఎమ్మెల్యే సత్యానందరావు**




కొత్తపేట ( ప్రశ్నన్యూస్) సమాన్యుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.రావులపాలెం క్యాంపు కార్యాలయం లో ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ ఈరోజు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. 73 వినతులు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు.

# విద్యార్థులను ఇబ్బంది పెడితే ఊరుకోం

**- పామర్తి అంకినీడు ప్రసాద్**

**- విద్యార్థుల తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త...**

**- శ్రీ రాగా స్కూల్ కి**

**సిట్టింగ్ అనుమతులు లేవు...?**



**కొత్తగూడెం (ప్రశ్న న్యూస్)** భద్రాద్రి జిల్లా కేంద్రంలోని మేదర బస్తీలో నిర్వహిస్తున్న శ్రీ రాగా పాఠశాలకు విద్యాశాఖ తరపున ఎలాంటి అనుమతులు లేవని అందులో చదివే విద్యార్థులకు భవిష్యత్తులో ఇబ్బందులు కలుగుతాయని ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పామర్తి అంకినీడు ప్రసాద్ అన్నారు. గతంలో మేదర బస్తీ ప్రాంతంలో నిర్వహిస్తున్న శ్రీ రాగా పాఠశాల కొన్ని కారణాల వల్ల అకస్మాత్తుగా ఖాళీ చేసే పరిస్థితి ఏర్పడిందని అందులో చదువుతున్న విద్యార్థుల దుస్థితిని గమనించి మానవ దృక్పథంతో తాను నిర్మించుకున్న భవనాన్ని శ్రీ రాగా పాఠశాల యాజమాన్యానికి అద్దెగా ఇచ్చానన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని శ్రీ రాగ స్కూల్ యాజమాన్యానికి తాను నిర్మించుకున్న భవనాన్ని అద్దెగా ఇచ్చినప్పటికీ అద్దె చెల్లింపులో కాలయాపన చేయటమే కాక నిర్లక్ష్య పూరితంగా వ్యవహరించారని పేర్కొన్నారు. బకాయిలు ఉన్న తన భవనానికి సంబంధించిన అద్దెను అడిగే క్రమంలో తనపై ఎలా కేసులు పెడతారని ఆరోపించారు. పాఠశాల నిర్వహణ తీరుపై అనుమానాలు కలిగిన తాను పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి సంబంధిత విద్యాశాఖ అధికారిని అడిగితే ఆ భవనంలో నిర్వహిస్తున్న శ్రీ రాగా పాఠశాలకు ఎలాంటి అనుమతి లేవని అధికారులే స్వయంగా చెప్పడాన్ని తాను జీర్ణించుకోలేక పోతున్నట్టు తెలిపారు. ఇంతకాలం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఒక బీసీ సంఘం నేతగా శ్రీ రాగా పాఠశాల నిర్వహకులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా అద్దె చెల్లింపు విషయంలో దౌర్జన్యాలకు దిగారని తెలిపారు. ఇప్పటికైనా మేదర బస్తిలో నిర్వహిస్తున్న శ్రీ రాగా పాఠశాలను రద్దు చేయాలని అనుమతి లేని పాఠశాలను సీజ్ చేసి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు అధికారులు కృషి చేయాలని ఆయన ఆరోపించారు. లేనిపక్షంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో దశల వారి ఆందోళనలకు సిద్ధమవుతున్నామని హెచ్చరించారు. ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి విద్యార్థుల తల్లిదండ్రులు తక్షణమే మేల్కొని అనుమతి లేని పాఠశాలలో చేర్చవద్దని ప్రాధేయపడ్డారు. జిల్లాలో అనేక పాఠశాలలు విద్యాశాఖ అనుమతి లేకుండానే విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని ఈ విషయంపై బీసీ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ఉద్యమాన్ని లేవదీస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బీసీ బీసీ సంఘం జాతీయ సలహాదారులు మిట్టపల్లి సాంబయ్య, ఉమ్మడి ఖమ్మం జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు సోమేశ్వర గౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కొదురుపాక మీనాక్షి, నాయకులు శంకర్, ప్రభాస్ గూడా విజయ్ పొదిల సర్వే తోటమంగా తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల వనదుర్గ క్షేత్ర మహాత్యం

**- ఏడుగురు ఋషులు, ఏడు నదుల కలయికే ఆ ఆలయం**

**- సంతాన గుండంలో ఐదు మునుగులు మునిగితే కోరిన కోరికలు తీరుతాయంట**







**(దుర్గం విజయ్ బాబు ప్రశ్న న్యూస్ బ్యూరో)**

కలియుగారంభంలో పందులో దూరి పరీక్షిత్తును కాటు వేసి తక్షకుడు(సర్పం) చంపేస్తాడు. తరువాత ఆ విషయం పరీక్షిత్తు కొడుకు జనమేజయుడికి తెలుస్తుంది. తన తండ్రిని చంపిన సర్పజాతి మొత్తాన్ని బూడిద చేసి నామరూపాల్లేకుండా చేయాలని జనమేజయుడు చేసిందే "సర్పయాగం". కొన్ని కోట్ల జాతులు అందులో పడి నశించాయి. తక్షకుడి పేరు చెప్పి స్వాహా అనగానే%ó%తక్షకుడు చావు భయంతో ఇంద్రుడి సింహాసనాన్ని చుట్టుకుంటాడు. జనమేజయుడు "స ఇంద్రతే తక్షకాయస్వాహా" అంటాడు. ఇంద్రుడి సింహాసనంతో పాటు కదిలిపోతుంది. అప్పుడు దేవతలు కలుగజేసుకుని. ఇప్పటికే కొన్ని కోట్ల సర్పజాతులు నశించాయి. శాంతించు నాయనా! అని జనమేజయుడిని చల్లబరుస్తారు. తక్షకుడు బతికిపోతాడు.

పాములకు- గద్దలకు జాతి వైరం. జనమేజయుడు సర్పయాగంలో ఫలానా కట్లపాము, నాగు పాము అని పేరు చెప్పగానే గరుత్మంతుడు ఆ పాములను కాలి గోళ్ల మధ్య తెచ్చి సర్పయాగంలో పడేసేవాడు. అలా ఆకాశమార్గంలో గరుత్మంతుడు పాములను తీసుకెళుతున్నప్పుడు వాటి రక్తం మంజీరలో పడి జలాలు ఎర్రగా అయ్యాయి. ఆ జలాలు తాగుకు, సాగుకు పనికిరాకుండా పోయాయి. దాంతో వనదుర్గ ఒక పాయను ఏడు పాయలుగా పలుచన చేసి. అందులో విషరక్తాన్ని తొలగించి. నీటిని పవిత్రీకరించింది. అందువల్ల ఇక్కడి దేవతకు "ఏడుపాయల వనదుర్గ" అన్న పేరు స్థిరపడిందని క్షేత్ర మాహాత్మ్య కథనం. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామం నుండి పదిమంది మిత్రుల బృందం రెండు కార్లలో అవసరమైన సామాగ్రిని తీసుకుని రెండు గంటల ప్రయాణం తరువాత ఏడుపాయలు చేరుకున్నాం. మెదక్ పట్టణంలో అవసరమైన కూరగాయలు, సామాగ్రి కొనుగోలు చేశాం. రాత్రి 9 గంటలకు వంటావార్పు చేసుకుని తిని ఆలయ పరిసర ప్రాంతాల్లో నిద్రించాం. ఉదయం నిద్ర లేవగానే కాల కృత్యాలు తీర్చుకొని నదిలో స్థానాలు చేసి, నదిలో ఉన్న శివలింగం నంది విగ్రహానికి కొబ్బరికాయ కొట్టి వన దుర్గామాతను దర్శించడానికి వెళ్ళాం. దారి పొడుగునా బలులకు వెళ్లే కోడి, మేకలతో మేళ తాళాలతో సందడి సందడిగా ఉంది. రంగు రంగులుగా ఏడుపాయలు పొంగిపోతోంది. జనమే జనం. మంజీరలో స్నానాలు, కాలువ గట్లు, గుట్టల మీద వంటలు. చూడ ముచ్చటగా ఉంది. గ్రామదేవతల జాతరల్లో ఉండే జోష్ అణువణువునా తొణకిసలాడుతోంది. తప్పెట దరువులకు ఊగిపోయే పూనకాలు, చేతుల్లో పసుపు పూసిన కోళు ,, మేకలు. పుట్నాలు- మరమరాలు అమ్మే దుకాణాలు, బొమ్మల అంగళ్లతో ప్రకృతికి ప్రాకృతికంగా ఏదో పండగ జరుగుతున్నట్లు ఉంది.

### వనదుర్గమాతను దర్శించుకుని మేకను మతకోల్పుకున్నాం

వన దుర్గ మాతను దర్శించుకుని ఏడుపాయల దుర్గామాత ప్రాంగణంలో ఉన్న సంతాన గుండంలో మొక్కులు తీర్చుకొని, వెంట తీసుకెళ్లిన మేకను పసుపు, బొట్టుతో మతకొలుపుకుని ఆలయంలో నుండి బయటకు వచ్చాం. కొద్ది దూరంలో పచ్చని పకృతి రమణీయ దృశ్యాల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో అమ్మవారికి మొక్కులు మొక్కి మేకను బలి ఇచ్చి, వంట వార్పు చేసుకుని, రెడ్ కార్పొరేట్ వేసుకొని కూర్చుని విందు భోజనాన్ని ఆరగించాం. అందమైన ఆహ్లాదకర వాతావరణంలో కాసేపు గడిపి మళ్లీ తిరుగు ప్రయాణం అయ్యాం.

### గుండంలో ఐదు మునుగులు మునిగితే

### అనుకున్నది అనుకున్నట్లే జరుగుతది

### ఏడుపాయల దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో

### సంతాన గుండం

సంతానం కలగని దంపతులు, మానసిక ఇబ్బందులతో బాధపడుతున్న ప్రజలు, దుర్గమ్మ తల్లిని కోరుకొని మొక్కులు మొక్కుకుంటే సంతానం ప్రాప్తిస్తుందని, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని ఏడుపాయల శ్రీ వన దుర్గా మాత ఆలయ ప్రాంగణంలోని సంతాన గుండంలో భక్తులు ఐదు మునుగులు మునిగి మొక్కులు మొక్కుకుంటున్నారు. తమ కోరికలు తీరిన తర్వాత ఒడి బియ్యం పోసి ముక్కులు చెల్లించుకుంటున్నారు. శ్రీ వనదుర్గ మాత ఆలయంలో ఈ సంతానగుండంకు ఓ ప్రత్యేకత ఉంది.

### ఏడుగురు ఋషులు, ఏడు నదుల కలయికే ఆ ఆలయం

ద్వాపర యుగాంతంలో పరీక్షిత్తు మహారాజు సర్పరాజు కాటుకు గురై ప్రాణాలు కోల్పోతాడు. రాజు కొడుకు జనమేజయుడు తండ్రి మరణానికి కారణమైన సర్ప సంతతిని సమూలంగా అంతమొందించాలని సర్పయాగం తలపెట్టాడు. యజ్ఞ గుండాలు నిర్మింపజేసి జమదగ్ని, అత్రి, కశ్యపి, విశ్వామిత్ర, వశిష్ట గౌతమి, భరద్వాజ వంటి సప్త రుషులతో ఈ యాగం నిర్వహిస్తాడు. యజ్ఞ ఫలితంగా సర్పాలన్నీ వచ్చి అగ్నికి ఆహుతవుతుండటంతో సర్పజాతి అంతమవుతుందనే ఆందోళనతో నాగులతల్లి దేవుళ్లకు వేడుకొనన్నదట. నాగులకు పుణ్యలోక గతులు ప్రాప్తించేందుకు గరుత్మంతుడు పాతాళంలోని భోగవతీ నదిని తీసుకుని వస్తాడు. యజ్ఞస్థలికి రాగానే భోగవతీ నది ఏడుపాయలుగా చీలి ప్రవహించిందట. సర్పయజ్ఞ గుండాలను ముంచుతూ ఓ పాయ రాతిగుహలో వెలిసిన దుర్గామాత పాదాలను తాకుతూ గోదావరిలో కలిసిందట. ఏడుగురు రుషులతో యజ్ఞం చేయడం. గంగాదేవి ఏడుపాయలుగా చీలి ప్రవహించడం వల్ల ఏడు పాయలు అనీ ఈ చరిత్రతో అమ్మవారికి ఏడుపాయల దుర్గామాత అని పేరు వచ్చింది.

# ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు కల్పించాలి

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలీ**

**- ఆసుపత్రిలో ఖాళీలను తాత్కాలిక ప్రాతిపదికన భర్తి చేయాలి**

**- ఆసుపత్రిలో సదెరం క్యాంపు రెగ్యులర్ గా నిర్వహించాలి**

**- సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించిన కలెక్టర్**



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో 2డి -ఎకో పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో పెట్టామని, వీటిని మరింత విస్తృతంగా వినియోగించాలని అన్నారు. డయాగ్నొస్టిక్ హబ్ లో అన్ని రకాల పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, శాంపిల్స్ సేకరణ, రిపోర్ట్ వేగంగా అందించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన వైద్యుల, టెక్నిషియన్స్ తాత్కాలిక ప్రాతిపదికన ఎక్కువ వేతనం అందించి నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఇతర ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న స్టాఫ్ అవసరం మేరకు డిప్యూటేషన్ చేయాలని అన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి కలెక్టర్ సమీక్షించి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. బయో మెడికల్ వేస్ట్ డిస్పోజల్ నిబంధనల ప్రకారం రెగ్యులర్ గా జరగాలని అన్నారు. సదెరం క్యాంపు పెండింగ్ ఉంచకుండా ఎప్పటి కప్పుడు క్యాంపులు నిర్వసించి దివ్యాంగులకు యూ.డి.ఐ.డి కార్డు జారీ చేయాలని అన్నారు. వేములవాడ ఆసుపత్రిలో మోకాల ఆపరేషన్ విజయవంతంగా జరుగుతున్నాయని, అదే విధంగా సిరిసిల్ల ఆసుపత్రిలో కూడా ఇటువంటి ఆపరేషన్ జరగాలని అన్నారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించి వారికి పరీక్షల నిర్వహణ చర్యలు తీసుకోవాలని అన్నారు. టి.బి వ్యాధి గ్రస్తులకు అవసరమైన చికిత్స పక్కాగా అందాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. లక్ష్మీనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రజిత, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. లక్ష్మీనారాయణ , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విరాట్ కోహ్లీ ఇష్యూ..

# అనవసర చర్చపై రకుల్ ప్రీత్ అసహనం



ఇటీవలి కాలంలో సోషల్ మీడియా వాడకం విపరీతంగా పెరిగిపోయిందని, అనవసర విషయాలపై ప్రజలు ఎక్కువ దృష్టి సారిస్తున్నారని నటి రకుల్ ప్రీత్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న రకుల్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ "నటి అవ్‌నీత్ కౌర్ ఫ్యాన్ పేజీలోని ఓ పోస్ట్‌ను విరాట్ కోహ్లీ లైక్ చేయడం పెద్ద చర్చనీయాంశమైంది. ఆ లైక్ వల్ల అవ్‌నీత్‌కు ఏకంగా 2 మిలియన్ల మంది ఫాలోవర్లు పెరిగారట. ఇది చాలా బాధ కలిగించే విషయం. మనమంతా ఇంత ఖాళీగా ఉన్నామా అనిపిస్తోంది" అని అన్నారు."విరాట్ కోహ్లీ ఉద్దేశపూర్వకంగా లైక్ చేశాడా, లేక పొరపాటున జరిగిందా అని కూడా ఎవరూ ఆలోచించలేదు. ఒక్కోసారి మనం ఇన్‌స్టాగ్రామ్‌లో మన స్నేహితులనే పొరపాటున అన్‌ఫాలో చేస్తుంటాం. కానీ, కోహ్లీ సెలబ్రిటీ కాబట్టి ఆయనకు సంబంధించిన చిన్న విషయాలను కూడా వైరల్ చేస్తున్నారు. ఇది చాలా విచారకరం. ఈ విషయంపై ఆయన ఇప్పటికే వివరణ కూడా ఇచ్చారు" అని తెలిపారు. సెలబ్రిటీలకు సంబంధించిన చిన్న చిన్న విషయాలను కూడా ప్రజలు అతిగా పట్టించుకుంటూ సోషల్ మీడియాలో సమయాన్ని వృథా చేస్తున్నారని రకుల్ అభిప్రాయపడ్డారు. "నా దృష్టిలో ఇది పూర్తిగా అనవసరం" అని ఆమె స్పష్టం చేశారు. గతంలో ఈ లైక్ విషయంపై విరాట్ కోహ్లీ స్పందిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లోని ఫీడ్‌ను క్లియర్ చేస్తున్నప్పుడు పొరపాటున లైక్ బటన్ నొక్కుకుపోయిందని తెలిపారు. దీని వెనుక ఎలాంటి ఉద్దేశం లేదని, అనవసర ఊహాగానాలు సృష్టించవద్దని ఆయన కోరారు. అయినప్పటికీ, కోహ్లీ లైక్ తర్వాత అవ్‌నీత్‌కు ఫాలోవర్లు గణనీయంగా పెరిగారని, ఆమెకు ప్రమోషన్ల అవకాశాలు కూడా ఎక్కువయ్యాయని బాలీవుడ్ వర్గాల్లో వార్తలు వచ్చాయి. ఇక సినిమాల విషయానికొస్తే, రకుల్ ప్రీత్ సింగ్ ప్రస్తుతం ప్రముఖ దర్శకుడు శంకర్ తెరకెక్కిస్తున్న 'ఇండియన్ 3' చిత్రంలో నటిస్తున్నారు.

## పూరి సేతుపతి ప్రాజెక్ట్‌లో

# రాధికా ఆప్టే..


### - స్పందించిన నటి



టాలీవుడ్ అగ్ర దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రస్తుతం తమిళ నటుడు విజయ్ సేతుపతితో ఒక సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. పూరిసేతుపతి అంటూ ఈ ప్రాజెక్ట్ రాబోతుండగా.. 'పూరి కనెక్ట్స్' బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ నటి టబు ముఖ్య పాత్రలో నటించబోతున్నట్లు ఇప్పటికే చిత్రబృందం వెల్లడించింది. అయితే ఇటీవల ఈ ప్రాజెక్ట్‌లో బాలీవుడ్ కథానాయిక రాధికా ఆప్టే నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.తాజాగా ఈ వార్తలపై స్పందించింది రాధికా ఆప్టే. మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. తాను ఈ సినిమాలో భాగమైనట్లు తనకే తెలియదని రాధికా ఆప్టే సరదాగా చెప్పారు. ఇలాంటి ఊహాగానాలు తనకు ఆశ్చర్యం కలిగిస్తాయని, ఈ వార్తల గురించి తనకేమీ తెలియదని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారాలు చాలా ఫన్నీగా అనిపిస్తాయని వెల్లడించారు.దర్శకుడు పూరి జగన్నాథ్, నటి చార్మి కౌర్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తుండగా.. ఈ చిత్రంలో విజయ్ సేతుపతిని ఇంతకు ముందెన్నడూ చూడని పాత్రలో చూపించనున్నట్లు పూరి జగన్నాథ్ ప్రకటించారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జూన్‌లో ప్రారంభమవుతుందని సమాచారం.

# నేను క్షమాపణలు చెప్పను'..

## తేల్చి చెప్పిన కమల్‌హాసన్



చెన్నై స్టార్ హీరో కమల్‌హాసన్ తాజాగా ఓ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఆయన చిత్రం 'థగ్ లైఫ్' ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలు కన్నడ భాషను కించపరిచేలా ఉన్నాయంటూ.. కన్నడిగులు కమల్‌పై మండిపడుతున్నారు. కమల్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

అయితే తాజాగా ఈ విషయంపై కమల్ స్పందించరు. తాను తప్పు చేస్తేనే క్షమాపణలు చెబుతానని లేకుంటే చెప్పను అని తేల్చి చెప్పేశారు. భారత్ ప్రజాస్వామ్య దేశమని, తాను చట్టాన్ని, న్యాయాన్ని నమ్ముతానని.. వాటిని గౌరవిస్తానని అన్నారు.'థగ్ లైఫ్' ఈవెంట్‌లో కమల్ మాట్లాడుతూ.. కన్నడ భాష తమిళం నుంచి పుట్టిందంటూ వ్యాఖ్యానించారు. దీనిపై కర్ణాటక అధికార, ప్రతిపక్ష నేతలతో పాటు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తీవ్రంగా స్పందించింది. మే 30లోగా కమల్ క్షమాపణ చెప్పకపోతే థగ్ లైఫ్ సినిమాను అడ్డుకుంటామని ప్రకటించింది. మరోవైపు కమల్ తాను చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికే వివరణ ఇచ్చారు. అవి ప్రేమతో చేసిన వ్యాఖ్యలేనని.. ప్రేమ ఎన్నడూ క్షమాపణ చెప్పదన్నారు.

# ఒకే సినిమాకు రెండు ప్రభుత్వాలు అవార్డులు ఇవ్వడం బాగోదు

### సినీ అవార్డులపై రెండు ప్రభుత్వాలు

**- ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్**



అవగాహనకు రావాలి

హైదరాబాద్ ఒకే సినిమాకు రెండు ప్రభుత్వాలు అవార్డులు ఇవ్వడం బాగోదని ప్రముఖ సినీ నటుడు మురళీమోహన్ తెలిపారు. ఎపిలోనూ సినీ అవార్డులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించే గద్దర్ అవార్డుల ప్రకటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినీ అవార్డులపై రెండు ప్రభుత్వాలు అవగాహనకు రావాలని, ఒక ఏడాది తెలంగాణ, మరో ఏడాది ఎపి ప్రభుత్వం అవార్డులు ఇవ్వాలని సూచించారు. తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాలూ కావాలని, సినిమాలను తెలంగాణ, ఆంధ్రా అంటూ వేర్వేరుగా చూడొద్దని కోరారు. సినిమాకు సంబంధించి తెలుగు ప్రేక్షకులంతా ఒకటేనని, తెలుగు సినిమా అంతర్జాతీయ స్థాయికి ఎదిగిందని హర్షం వ్యక్తం చేశారు. తెలుగు సినిమాలను మనకంటే ముందు అమెరికా వాళ్లు చూస్తున్నారని మురళీమోహన్ పేర్కొన్నారు.

# బేబి హారికకు గద్దర్ అవార్డ్ !




తెలంగాణ ప్రభుత్వం తెలుగు మూవీలకు అందిస్తున్న గద్దర్ అవార్డ్స్ లో మెర్సీ కిల్లింగ్ లో నటించిన బేబి హారిక ఉత్తమ చైల్డ్ ఆర్టిస్టుగా ఎంపికైంది. సాయి సిద్దార్ద్ మూవీ మేకర్స్ బ్యానర్ పై తెరకెక్కిన సినిమా "మెర్సీ కిల్లింగ్ లో సాయి కుమార్, పార్వతీశం, ఐశ్వర్య, బేబి హారిక ప్రధాన పాత్రల్లో నటించారు. సిద్ధార్ద్ హరియల, మాధవి తాలబత్తుల ఈ సినిమాను నిర్మించారు. సూరపల్లి వెంకటరమణ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాకు ఎం.ఎల్.రాజా సంగీతం సమకూర్చారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఆధారంగా తెరకెక్కిన చిత్రం మెర్సీ కిల్లింగ్ . స్వేచ్ఛ అనే అనాధ బాలిక తనకు న్యాయం చేయాలంటూ ఈ కథ ప్రారంభం అవుతుంది. గత ఏడాది ఏప్రిల్ 12న థియేటర్స్ లో విడుదలైన మెర్సీ కిల్లింగ్ మంచి విజయం సాధించింది. ఎమోషనల్ కథతో సమాజంలో జరిగే కొన్ని సంఘటనలను తీసుకొని చేసిన మెర్సి కిల్లింగ్ సినిమా ప్రస్తుతం ఆహాలో స్ట్రీమింగ్ అవుతోంది

# 'షష్టిపూర్తి' సినిమా రివ్యూ




నటకిరీటి డా.రాజేంద్రప్రసాద్, సీనియర్ నటి అర్చన, యువ కథానాయకుడు రూపేష్, ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'షష్టి పూర్తి కుటుంబ కథా నేపథ్యంలో వచ్చిన ఈ సినిమాకు యువ దర్శకుడు పవన్ ప్రభ దర్శకత్వం వహించగా.. మా ఆయి ) ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ నిర్మించారు. ఈ చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. అయితే ఈ సినిమా ఎలా.. ఉంది. ప్రేక్షకులను ఆకట్టుకుందా లేదా అనేది రివ్యూలో చూద్దాం.కథ విషయానికి వస్తే.. ఈ చిత్రం శ్రీరామ్ (రూపేష్) అనే యువ న్యాయవాది చుట్టు తిరుగుతుంది. చిన్నతనం నుంచే నీతి, న్యాయం అంటూ పెరిగిన శ్రీరామ్ న్యాయవాదిగా వాటిని కాపాడడానికి అంకితభావంతో పోరాడుతాడు. వృత్తిపరంగా అతను న్యాయాన్ని రక్షించడానికి ప్రయత్నిస్తుండగా మరోవైపు అతని వ్యక్తిగత జీవితంలో జానకి (ఆకాంక్ష సింగ్) అనే అమ్మాయి ప్రవేశిస్తుంది. అయితే ఈ విషయం ఇంట్లో చెబుదామంటే శ్రీరామ్ తల్లిదండ్రులు రాజేంద్ర ప్రసాద్, అర్చనలు చాలా రోజుల నుంచి మట్లాడుకోకుండా ఉంటారు. అయితే వీరిని కలుపుదామని జానకి, శ్రీరామ్ కలిసి షష్టిపూర్తి ప్లాన్ చేద్దామనుకుంటారు. ఈ క్రమంలోనే జరిగిన సంఘటనలు ఏమిటి.. అసలు రాజేంద్ర ప్రసాద్, అర్చనలు ఎందుకు మాట్లాడుకోరు.. అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే. 'షష్టిపూర్తి' చిత్రానికి ప్రధాన ఆకర్షణ శ్రీరామ్ తన తల్లిదండ్రుల మధ్య ఉన్న దూరాన్ని తొలగించి, వారిని తిరిగి ఏకం చేయడమే. ఈ ప్రయాణంలో ఎదురైన భావోద్వేగ సంఘటనలను దర్శకుడు పవన్ ప్రభ ఎంతో ఎమోషనల్‌గా ప్రేక్షకుల మనసుకు హత్తుకునేలా తెరకెక్కించాడు. ఈ చిత్రం కేవలం ఒక ప్రేమకథకు మాత్రమే పరిమితం కాదు, ఇది రెండు విభిన్న తరాలకు చెందిన ప్రేమను, బంధాలను అద్భుతంగా చిత్రీకరించింది. ఒకవైపు శ్రీరామ్, జానకి మధ్య ప్రేమను చూపిస్తూనే, మరోవైపు అతని తల్లిదండ్రుల మధ్య ఉన్న సంక్లిష్టమైన, దీర్ఘకాల సంబంధాన్ని లోతుగా ఆవిష్కరించింది. ఈ చిత్రం కుటుంబ విలువలు, తల్లిదండ్రుల పట్ల గౌరవం, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని గొప్పగా చూపిస్తుంది. దర్శకుడు పవన్ ప్రభ ఉమ్మడి కుటుంబ నేపథ్యం నుండి స్ఫూర్తి పొంది, తల్లిదండ్రులను విడిదిపెట్టే ప్రస్తుత సమాజంలో ఒక సమస్యను సున్నితంగా హైలైట్ చేశారు. అపార్థం చేసుకోబడిన భర్త పాత్రలో రాజేంద్ర ప్రసాద్ తన నటనతో హృదయాలను గెలుచుకున్నాడు. అతని భావోద్వేగ నటన చిత్రానికి బలమైన ఆధారంగా చెప్పవచ్చు. ఇక మూడు దశాబ్దాల తర్వాత తెలుగు సినిమాకు తిరిగి వచ్చిన అర్చన, భావోద్వేగమైన, సంక్లిష్టమైన పాత్రలో అద్భుతంగా నటించారు. రూపేష్ తన నటనతో సినిమాకు ప్రాణం పోశాడని చెప్పవచ్చు. ముఖ్యంగా తల్లిదండ్రులు గొడవ పడినప్పుడు ఒక కొడుకి పాత్రలో ఎలా ఉంటారో జీవించి చూపించాడు. ఆకాంక్ష సింగ్ కూడా తన సహజమైన నటనతో పాత్రకు జీవం పోసింది.

# వెన్నుపోటు దినం కాదు ప్రాయశ్చిత్తదినం జరుపుకోండి

- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

ఐదేళ్లు విధ్వంసం గుర్తుగా జగన్మోహన్ రెడ్డి వైసీపీ పార్టీ ప్రాయశ్చిత్త దినం జరుపుకోవాలి .

ప్రజలు 151 సీట్లు ఇస్తే వారికి వెన్నుపోటు పొడిచింది జగన్మోహన్ రెడ్డి.




కొత్తపేట(ప్రశ్న న్యూస్) మద్యం కుంభకోణంలో దర్యాప్తు వేగం అందుకుంటున్న కొద్దీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కలవర పడుతున్నట్లున్నారు. ఈ వ్యవహారంలో సిట్ అధికారులు నేరంతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉన్న వారిని అరెస్టు చేస్తుండటంతో జగన్ ఉలిక్కిపడుతున్నారు. లిక్కర్ కుంభకోణం, జెత్వానీ కేసుతో పాటు ఇతర కేసుల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అరెస్ట్ కావడం,అధికారులు జైలుకు వెళ్ళాల్సి రావడం గత ప్రభుత్వ నిర్వాకం కాదా అని అన్నారు.అవినీతి సామ్రాట్ జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అక్రమ సొమ్ము రాష్ట్రంలో ఏరులై పారింది.తన ఏలుబడిలో ఏం జరిగిందో జనానికి గుర్తులేదన్నట్టుగా జగన్మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు అని అన్నారు.అధికారంలో ఉన్నప్పుడు ఎడాపెడా దోచుకొని ఇప్పుడు చంద్రబాబే కుంభకోణాలకు పాల్పడ్డారని చెబుతుండటం ఆయన విపరీత మనస్తత్వానికి నిదర్శనం.జూన్ 4వ తేదీన వెలువడిన ఎన్నికల ఫలితాలు వైసిపి ని 11 సీట్లకే పరిమితం చేశాయి అని అన్నారు.ఫలితాలు వెల్లడైన రోజును ప్రజలు తనకు వెన్నుపోటు పొడిచారని జగన్ భావించడం ఆయన విపరీత మనస్తత్వానికి నిదర్శనంవైసీపీ నిర్వహించాల్సింది వెన్నుపోటు దినాలు కాదు. ప్రాయశ్చిత్త దినాలుమహానాడు విజయవంతం కావడం చూసి వైసిపి నేతలు ఓర్వలేకపోతున్నారు విధ్వంసాలు, దహనాలు తప్ప వారికి వేరే ఆలోచనలు ఉండవు అని అన్నారు. లోకేష్ మాకు భవిష్యత్తు నాయకుడు ఆయన ఎదుగుదలను చూసి తట్టుకోలేని వైసిపి నేతలు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. అవినీతిపరులు అవినీతి గురించి మాట్లాడదాం హాస్యాస్పదంగా ఉంది అని అన్నారు.

# పార్టీ శ్రేణుల ఐఖ్యతకు మహానాడు సూపర్ సక్సెస్ నిదర్శనం

- ఎమ్మెల్యే సత్యానందరావు



రావులపాలెం (ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీ ఐఖ్యతకు నిదర్శనం గత మూడు రోజుల పాటు కడపలో జరిగిన మహానాడు సూపర్ సక్సెస్ ఉదాహరణ అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు.రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ కార్యకర్తల సమస్యల పట్ల,సంక్షేమం పట్ల పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు,నారా లోకేష్ పూర్తి నిబద్ధతతో ఉన్నారని తెలిపారు.మహానాడు వేదికగా ఇదే విషయాన్ని చంద్రబాబు వెల్లడించారని చెప్పారు.కార్యకర్తల సమస్యలకు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కారం కోసం కృషి చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధమేనని ఎమ్మెల్యే సత్యానందరావు అన్నారు.అలాగే కడపలో జరిగిన మహానాడును జయప్రదం చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు,అభిమానులకు సత్యానందరావు ధన్యవాదాలు తెలియజేశారు.

# స్థానిక ఎన్నికలు జాప్యం...! గ్రామాల అభివృద్ధికి ఆటంకం

- స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీ సాధికారత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లాధ్యక్షులు
- పొలాస నరేందర్ డిమాండ్



వేములవాడ,(ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా, శాస్త్రీయంగా అమలు చేస్తూ త్వరగా ఎన్నికలు జరపాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు పొలాస నరేందర్ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 నెలలుగా బీసీ రిజర్వేషన్ల ఖరారు జాప్యం కారణంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి మందగించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయకపోవడం వల్ల గ్రామీణ ప్రజలు మౌలిక సదుపాయాల కరువుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.“అధికారం ఉంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాలి. లేకపోతే కేంద్రాన్ని ఒప్పించి, రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్ ద్వారా చట్టబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేయాలి. ఎన్నికలు ఇంకింత ఆలస్యం అయితే, గ్రామాలు అంధకారంలో మిగిలిపోతాయి,” అని నరేందర్ హెచ్చరించారు.రాష్ట్ర ప్రభుత్వం గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీ ఇచ్చినప్పటికీ, కులగణన సర్వే నిర్వహించినా, బిల్లులు గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపినప్పటికీ, ఇప్పటివరకు కేంద్రం నుంచి ఆమోదం లభించలేదని ఆయన విమర్శించారు.“ఆర్టికల్ 15(4), 16(4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు రిజర్వేషన్ల అమలుకు పూర్తి అధికారం ఉంది. తమిళనాడు మాదిరిగా తొమ్మిదో షెడ్యూల్లో చేర్చి రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని కోరుతున్నాం,” అని నరేందర్ స్పష్టం చేశారు.చివరిగా, గ్రామాల అభివృద్ధి దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర- కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో త్వరితగతిన స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నరేందర్ డిమాండ్ చేశారు.

# యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి: డాక్టర్ శాంతి ప్రభ




అనకాపల్లి ( ప్రశ్న న్యూస్)యోగా వల్ల ఆరోగ్యం బాగుంటుందని ప్రతి ఒక్కరూ విధిగా రోజు యోగ సాధన చేసినట్లయితే మనుషులు రోగాలు బారిన పడకుండా ఆరోగ్యాంగా, సంపూర్ణంగా, ప్రశాంతంగా జీవిస్తారని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శాంతి ప్రభ అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి పట్టణం స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉదయం ఏడు గంటల నుండి 9 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారుల తో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి యోగా గురువుల పర్యవేక్షణలో యోగాసనలు వెయ్యడం జరిగింది. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శాంతి ప్రభ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె లావణ్య ఆధ్వర్యంలో యోగ పై అవగాహన ర్యాలీని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నుండి ఎన్. టి. ఆర్, జిల్లా కేంద్ర ఆసుపత్రి వరకు భారీ ర్యాలీ నిర్వహించి యోగాంధ్ర పై ప్రజలను చైతన్య పరచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె లావణ్య, జిల్లా లెప్రసీ అధికారి బాలాజీ నర్సిపట్నం ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె. విరజ్యోతి, జాతీయ ఆర్యో యషన్ జిల్లా అధికారివు డా. ప్రశాంతి, జిల్లా వ్యాధినిరోధక టికాల అధికారి డా. చంద్ర శేఖర్ దేవ్, ఆర్ ఎం ఓ గౌతమ్ అనకాపల్లి ఎన్.ట్.ఆర్. వైద్యశాల సూపరింటెండెంటే డాక్టర్ కృష్ణ రావు, జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయ సిబ్బంది జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లో పని చేయు చున్న వైద్యాధికారులు పాల్గొన్నారు.

# పాఠశాలలు ప్రారంభించేనాటికి సంక్షేమ వసతి గృహాల మరమ్మతులు పూర్తి చేయాలి : మంత్రి డోలా



ప్రకాశం(ప్రశ్న న్యూస్) పాఠశాలలు ప్రారంభించేనాటికి జిల్లాలోని ఎస్సి సంక్షేమ వసతి గృహాల మరమ్మతులు పూర్తి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రకాశం జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించేనాటికి జిల్లాలోని ఎస్సి సంక్షేమ వసతి గృహాల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడా పెండింగ్ లేకుండా అన్ని వసతి గృహాల్లో పనులు పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దన్నారు. ఒంగోలు, యర్రగొండపాలెంలో నూతన వసతి గృహాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూ.143 కోట్లతో సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు చేస్తున్నామని మంత్రి డా.డోలా బాల వీరాంజ నేయస్వామి తెలిపారు.

# 90 వ వార్డులో తారు రోడ్డు నిర్మాణానికి నగర మేయర్ శంకుస్థాపన



విశాఖపట్నం( ప్రశ్న న్యూస్) విశాఖ నగర అభివృద్దే ధ్యేయంగా నగర పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ 8వ జోన్ 90 వ వార్డు పరిధిలోని లక్ష్మీ నగర్ సెయింట్ థెరిసా స్కూల్ తదితర ప్రాంతాలలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ . 190 లక్షలు వెచ్చించి పలుచోట్ల తారు రోడ్డు నిర్మాణం, సెంటర్ డివైడర్, కవర్ స్లాబ్, ఎం ఎస్ గిల్స్, పెయింటింగ్ మొదలైన పనులకు 90 వ వారు కార్పొరేటర్ బొమ్మిడి రమణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి వార్డును అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతున్నదని , రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధాని చేయాలన్న కృతనిత్యంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. 90 వార్డు లక్ష్మీ నగర్ లో 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి తారు రోడ్డు నిర్మాణం తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు నేడు శంకుస్థాపన చేశామని, అలాగే వార్డులోని ప్రజలకు అవసరమయ్యే మరిన్ని మౌలిక వసతులు కల్పనతో పాటు సంక్షేమ కార్యక్రమాలు కూడా చేపట్టడం జరుగుతుందని మేయర్ తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న పార్వతి చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 8వ జోన్ జోనల్ కమిషనర్ హేమావతి, కార్య నిర్వాహక ఇంజనీరు దిలీప్, ఉపకార్య నిర్వహక ఇంజనీర్ ప్రవీణ్ ,ఏఎంఓహెచ్ అప్పలనాయుడు, ఏపీడీ చిరంజీవి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జంఝావతి నదికి జలహారతి.

## ఐదు దశాబ్దాలుగా ఎన్నికల హామీగానే మిగిలింది

ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి తదితరుల సంఘీభావం



**పార్వతీపురం(ప్రశ్న న్యూస్)** పార్వతీపురం జిల్లా, కొమరాడ మండలం, రాజ్యలక్ష్మి పురం గ్రామ సమీపంలో గల జంఝావతి నదికి జంఝావతి సాధన సమితి జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆ సమితి అధ్యక్షులు చుక్క భాస్కరరావు, కార్యాచరణ కన్వీనర్ మరిశర్ల మాలతి కృష్ణమూర్తి నాయుడు, సలహాదారు భారతనంద స్వామీజీ, వర్కింగ్ ప్రెసిడెంట్లు సవరపు రామారావు, ఇవి నాయుడు, చీఫ్ అడ్వైజర్ జగన్నాథ్ ప్రసాద్ రాయగురు, ఉపాధ్యక్షులు ఈర్ల సంజీవ నాయుడు, చుక్క చంద్రరావు, వారణాశి శ్రీహరి, మాన్యం రామకృష్ణ, మంత్రపూడి వెంకటరమణ, కార్యాచరణ కో- కన్వీనర్లు జాగరపు ఈశ్వర ప్రసాద్, గవిరెడ్డి సత్య సింహ రఘు చక్రవర్తి, వంగల దాలి నాయుడు, కార్యదర్శులు తీళ్ళ గౌరీ శంకర్రావు, అట్టాడ రవికుమార్, పి రంజిత్ కుమార్, తదితరులతో కలసి, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ పార్వతీపురం నియోజకవర్గం ఇన్చార్జ్ బత్తిన మోహన్ రావు, సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకృష్ణ, సిపిఐ నాయకులు తోట జీవన్, గరుగుబిల్లి సూరయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు, సీపీఐ ఎం.ఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు పి. సంగం, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు చల్లారపు వెంకట నాయుడు, ఈశ్వరరావు మాస్టర్ తదితరుల సంఘీభావంతో జంఝావతి నదిలో జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంఝావతి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరు అందించేలా దీవించాలని పసుపు, కుంకుమ, పూలతో గంగా మాతాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మురుగు కాలువల్లో చెత్త లేకుండా తొలగించండి కమిషనర్ మౌర్య



**తిరుపతి (ప్రశ్న న్యూస్)** మురుగు కాలువల్లో ఎక్కడా చేతలేకుండా తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో ఎన్.జీ.ఓ కాలనీ, కపిలతీర్థం రోడ్డు, ప్రకాశం పార్క్ రోడ్డు, కె.టి.రోడ్డు తదితర ప్రాంతాల్లో అధికారులతో కలసి పారిశుధ్య పనులను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో చెత్త కుప్పలు ఉండడంతో సిబ్బందిని మందలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఉదయాన్నే ప్రధాన రహదారుల్లో ముందుగా చెత్త కుప్పలు తొలగించాలని అన్నారు. త్వరలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కాబట్టి మురుగునీటి కాలువల్లో ఎక్కడా చెత్త లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇండ్లలోని చెత్తను తమ కాలువల్లో వేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి అందజేయాలని ప్రజలకు సూచించారు. కమిషనర్ వెంట తుడా ఈ.ఈ. రవీంద్ర రెడ్డి, నగరపాలక సంస్థ డి.ఈ. వెంకట ప్రసాద్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య , తదితరులు ఉన్నారు.

# మంథని పట్టణంలోని దుద్దిల్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు

## పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్

మంథని( ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ఐటీ , పరిశ్రమలు, శాసనసభ వ్యవహార శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు జన్మదిన వేడుకల అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి అన్నదానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష 60 ఏళ్ల తెలంగాణ కలను నెరవేర్చినటువంటి గొప్ప వ్యక్తి అని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల్లో వేలకోట్ల నిధులు తీసుకొచ్చి మంథని నియోజకవర్గంలో అనేక రోడ్లు, ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేయడం జరిగిందని విద్యారంగంలో అగ్రస్థానంలో నిలిపేందుకు అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆ క్రమంలో ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్ అంతర్జాతీయ ప్రమాణాలు కలిగి ఉన్నటువంటి స్కూలు ఈ ప్రాంతంలో నెలకోల్పడం జరుగుతుందని వారు తెలిపారు ఈ ప్రాంతంలో ఉన్నటువంటి విద్యార్థులకు పోటీ పరీక్షల్లో నెగ్గెందుకు ఉచిత కోచింగ్ సెంటర్, స్కిల్స్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూషన్ సాఫ్ట్వేర్ కంపెనీని తీసుకువచ్చి ఈ ప్రాంతంలో ఉన్నటువంటి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు వారు కృషి చేస్తున్నారని తెలిపారు ఇచ్చిన హామీలన్నిటిని ఒకటొకటిగా నెరవేరుస్తున్నారని సన్నబియ్యం పంపిణీతో పేదల కళ్ళల్లో ఆనందం విరజిల్లుతుందని అలాగే రాబోయే రోజులలో త్వరలోనే నిరుపేదలకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వబోతున్నారని తెలిపారు నిరంతరం ప్రజల కోసం ప్రజాసేవలో ఉండే ప్రజా నాయకుడు ఇలాంటి జన్మదిన వేడుకలు నిండు నూరేళ్లు జరుపుకోవాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు మాతా శిశు ఆస్పటల్ లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు, అలాగే రక్తదాన శిబిరాలు నిర్వహించారు గౌడ సంఘం నాయకులకు చెక్కులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, మైనార్టీ సెల్ నాయకులు, మహిళ నాయకురాలు, కార్యకర్తలు ఆ క్రమంలో డి.ఎస్.బి అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు



# లక్షకు లక్ష అంటే ఫ్లాటైపోయారు

# 150 కోట్లు లాసైపోయారు

## - హైదరాబాద్‌లో భారీ ట్రేడింగ్ మోసం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** స్టాక్ మార్కెట్లో డబ్బుల పంట పండుతోంది. లక్ష పెడితే, కొద్ది రోజుల్లోనే లక్ష వస్తాయి. లక్షకు లక్ష అని ఓ కంపెనీ ఆశచూపడంతో అమాయకులు నిండా మునిగిపోయారు. నిజమేనని నమ్ముకుని ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకుని సంపాదించుకున్న సొమ్ము, మరికాస్త అప్పులు చేసి పెట్టుబడిగా పెట్టారు. ఇప్పుడు తమకు న్యాయం చేయాలని పోలీసుల వద్దకు పరుగులు పెడుతున్నారు.

### - పెంగ్విన్ సెక్యూరిటీస్ పేరుతో ఆఫీస్

మేడ్చల్ జిల్లాజీడిమెట్ల పియస్ పరిదిలోని చింతల్ లో కొద్ది రోజుల కిందట "ది పెంగ్విన్" పేరుతో ఓ కంపెనీ ఏర్పాటయింది. తాము స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ చేస్తామని ప్రచారం చేసుకుంది. తమ వద్ద పెట్టుబడి పెడితే లక్ష రూపాయలకు లక్ష లాభం ఇస్తామని చెప్పి 1500మంది కష్టమర్ల వద్ద 150 కోట్లు వసూలుచేశారు. ఇప్పుడు లక్షకు లక్షకాదు కదా అసలు కూడా ఇవ్వకుండా పరారయ్యారు. మోసపోయామని గ్రహించి జీడిమెట్ల పియస్ కి భాదితులు క్యూ కట్టారు.

### - స్టాక్ మార్కెట్ లో బాగా డబ్బులు సంపాదించవచ్చని ప్రచారం

చింతల్, గణేష్‌నగర్‌లో 'ది పెంగ్విన్ సెక్యూరిటీస్' అనే పేరుతో కొందరు ఒక సంస్థను ఏర్పాటు చేశారు. కాస్త హైఫైగా ఏర్పాటు చేసిన సంస్థ గురించి అక్కడి స్థానికుల్లో గొప్పగా ప్రచారం చేయించుకున్నారు. స్టాక్ మార్కెట్లలో కోట్లు సంపాదించారని ప్రచారం చేసుకున్నారు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే తక్కువ కాలంలోనే మంచి రాబడి వస్తుందని అందర్నీ నమ్మించారు. తాము పెట్టిన పెట్టుబడికి కోట్లు సంపాదించామని ఇంకా ఎక్కువ పెట్టుబడి పెడితే ఇంకా ఎక్కువ వస్తుందని అందుకే జనాల సొమ్ముతో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నామని చెప్పారు.

### - కొంత మందికి డబ్బులు ఇచ్చి.. మిగతా అందరికీ బాండ్లు

మొదట్లో పెట్టుబడులు పెట్టిన వారికి ఆకర్షణీయమైన పథకాలతో తిరిగి డబ్బులు ఇచ్చారు. అలా డబ్బులు పొందిన వారు ప్రచారం చేయడమే కాదు మరికొంత సొమ్ము వవేసి అక్కడే జమ చేయడం ప్రారంభించారు.

కొద్దిరోజులు పోయాక తమ వద్ద వారి సొమ్ము పేరుకుపోయిందని అంతా స్టాక్స్ లో పెడుతున్నామని భారీగా పెరుగుతోందని నమ్మిస్తూ వచ్చారు. అయితే కొద్ది రోజులుగా ఎవరికీ డబ్బులు తిరిగి ఇవ్వడం లేదు. అప్పటికే వీరి మాయమాటలు నమ్మిన సుమారు 1,500 మంది అమాయకులు తమ కష్టార్జితాన్ని ఈ సంస్థలో పెట్టుబడులుగా పెట్టారు. హఠాత్తుగా ఓ రోజు బోర్డు తిప్పేశారు.

### - పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

మదుపర్లకు నమ్మకం కలిగించేందుకు వారికి బాండ్ల రూపంలో కొన్ని పత్రాలను కూడా సంస్థ నిర్వాహకులు అందజేశారు. అవి ఎందుకు పనికి రావని తేలిపోయింది.

బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అసలు వాళ్లెవరు ఇంత ఈజీగా ఎలా మోసం చేశారన్నదానిపై దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మార్వో కార్యాలయంలో

# ప్రైవేటు వ్యక్తుల వసూల్ దందా.?

- సర్టిఫికెట్లు కావాలంటే ప్రైవేటు వ్యక్తుల శరణు కోరాల్సిందే
- ప్రభుత్వ ఉద్యోగులకు అవినీతి మరక అంటకుండా ప్రైవేటు వ్యక్తులతో వసూల్
- ప్రైవేటు వ్యక్తులను ప్రోత్సహిస్తున్న ఎంఆర్ఓ పై ప్రజల ఆగ్రహం
- విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్న ఎమ్మార్వో రవీందర్ దత్ పై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

**శంషాబాద్ (ప్రశ్న న్యూస్)** శంషాబాద్ తహసిల్దార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల హల్చల్ కొనసాగుతుంది. ఎమ్మార్వో రవీందర్ దత్ ఇతర సిబ్బంది ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకొని అందిన కాడికి దండుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.( ఎమ్మార్వో కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు వాళ్లకు కావలసిన వ్యవహారాలను చక్కదిద్దుకుంటూ వసూలులో కీలకపాత్ర వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఎమ్మార్వో ప్రైవేటు వ్యక్తులను అనుమతించరాదని తెలపడంతో కొన్ని రోజులపాటు ఎమ్మార్వో కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం లేకుండా పోయింది. కానీ ప్రస్తుతం తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న రవీందర్ దత్ రావడంతో దాదాపు పది మంది వరకు ప్రైవేటు వ్యక్తులు శంషాబాద్ తహసిల్దార్ కార్యాలయంలో అన్ని తామై చూసుకోవడం విడ్డూరంగా మారింది. శంషాబాద్ ఎమ్మార్వో కార్యాలయం పరిధిలో ప్రభుత్వ స్థలాలు భారీగా ఉన్నాయి వాటిని రక్షించడంలో ఎమ్మార్వో కార్యాలయం పూర్తిగా విఫలం చెందింది. గతంలో ఎమ్మార్వోలు ప్రస్తుత ఎమ్మార్వో సైతం భూములు పూర్తిగా కనుమరుగవుతున్నాయని అందులో ఎలాంటి సందేహం లేదని ప్రతిపక్ష నాయకులు ఎన్ని ఆరోపణలు చేసిన ఎమ్మార్వోలలో అవినీతి మాత్రం ఆగడం లేదు. భూకబ్జారాయిలతో చేతులు కలిపి అందిన కాడికి దండుకుంటూ కోట్లకు పడగలెత్తుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే శంషాబాద్ ఎమ్మార్వో కార్యాలయం పరిధిలో వేల ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్న వాటిని పరిరక్షించలేకపోతున్నారు అధికారులు. చాలామంది కబ్జాదారులకు తహసిల్దార్లు సహకరిస్తున్నారని ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకొని తనకు ఎలాంటి సంబంధం లేదన్నట్లుగా ఎమ్మార్వో ప్రైవేటు వ్యక్తులతో వసూల్ దందా చేపిస్తుంటే డిప్యూటీ కలెక్టర్, కలెక్టర్లు విషయం తెలిసి కూడా శంషాబాద్ తహసిల్దార్ కార్యాలయం పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇక విద్యార్థుల సర్టిఫికెట్ల విషయంలో ప్రైవేటు వ్యక్తులు ఏకంగా వసూల్ దందా కౌంటర్ ను ఓపెన్ చేయడం జరిగిందని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కార్యాలయానికి వస్తేనే ఎంతో కొంత తీసుకొని





ప్రభుత్వ స్థానంలో కాపాడడంలో పూర్తిగా విఫలం చెందారు ప్రైవేటు వ్యక్తులతో చేతులు కలిపి ప్రభుత్వ స్థలాలలో వెంచర్లు చేసి ప్లాట్లుగా అమ్ముతున్న, అక్రమంగా షెడ్లు నిర్మించిన శంషాబాద్ తహసిల్దార్ పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఎమ్మార్వోల అవినీతి అక్రమాల వల్లనే ఈరోజు ప్రభుత్వ సర్టిఫికెట్లు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు అన్ని రకాల విధులు నిర్వహిస్తూ లంచాల కార్యాలయంగా మారుస్తున్న ఎమ్మార్వోకు తెలిసి ఎందుకో చర్యలు తీసుకోవడం లేదో ఆయనకే తెలియాలని దీని వెనుక ఆర్థిక లావాదేవీలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మార్వో కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల వ్యవహారంపై స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిసి కూడా మౌనం వహించడం ఏమిటని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి శంషాబాద్ ఎమ్మార్వో కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తుల అవినీతి దందాను అడ్డుకోవాలని ప్రైవేట్ వ్యక్తులతో కార్యాలయంలో వసూలు చేయిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఎస్ పి ఎఫ్ సిబ్బంది

# చాకచక్యంతోనే దొంగలు దొరికారు

- ఆలయ ఎస్పీఎఫ్ ఇన్స్పెక్టర్ శేషగిరిరావు
- ఆలయ ప్రసాద విక్రయశాలలో చింతపండు బస్తాల చోరీ ఘటనపై వివరణ
- ప్రసాద విక్రయశాలలో చోరీ జరగకుండా అడ్డుకుంది ఎస్పీఎఫ్ సిబ్బందే
- యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి రక్షణలో ఎస్పీఎఫ్ అన్నివేళలా రక్షణగా ఉంది




యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) అర్ధరాత్రి ప్రసాద విక్రయశాల పరిసరాల్లో కారు తో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే ఎస్పీఎఫ్ సిబ్బంది వెతుకుతుండగా పెట్రోలింగ్ వాహనం వచ్చిందని ఎస్పీఎఫ్ పోలీసులు,పెట్రోలింగ్ పోలీసులు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తే చోరీ ఘటన బయటపడిందని వెల్లడించారు.చోరీకి యత్నించిన వ్యక్తులు ప్రసాద విక్రయశాలలో విధులు నిర్వహించే అవుట్ సోర్సింగ్ సిబ్బందిగా గుర్తించామన్నారు.చోరీ ఘటన బయటపడగానే ఆలయ అధికారులకు సమాచారం అందించామన్నారు.ఆలయ అధికారులు పట్టుబడిన ఇద్దరు అవుట్ సోర్సింగ్ సిబ్బంది పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.ఘటనపై ఆలయ ఈఓ ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేస్తున్నారని తెలియజేసారు.ఘటనలో ఆలయ ఎస్పీఎఫ్ పోలీసులది ఎలాంటి నిర్లక్ష్యం లేదని స్పష్టం చేశారు.

# నాలుగేళ్ల కనిష్ఠానికి జీడీపీ వృద్ధి రేటు

### - కానీ చైనాతో పోలిస్తే మెరుగు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగం కొంత మందగించింది. శుక్రవారం విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం, 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు 6.5 శాతంగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరమైన 2023-24లో నమోదైన 9.2 శాతం వృద్ధితో పోలిస్తే ఇది గణనీయమైన తగ్గుదల అని జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను జీడీపీ వృద్ధి 6.5 శాతంగా ఉండవచ్చని ఎన్ఎస్ఓ తన రెండో ముందస్తు అంచనాల్లో పేర్కొంది. ప్రస్తుతం విడుదలైన గణాంకాలు ఆ అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. కొవిడ్ మహమ్మారి సంక్షోభం తదనంతరం ఆర్థిక వ్యవస్థ వేగంగా పుంజుకున్న తర్వాత, వృద్ధి రేటు ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఇక, 2024-25 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం (జనవరి-మార్చి 2025) విషయానికొస్తే, జీడీపీ వృద్ధి రేటు 7.4 శాతంగా నమోదైంది. అయితే, 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో నమోదైన 8.4 శాతం వృద్ధితో పోలిస్తే ఇది తక్కువేనని ఎన్ఎస్ఓ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు, చైనా ఆర్థిక వ్యవస్థ 2025 మొదటి మూడు నెలల కాలంలో (జనవరి-మార్చి) 5.4 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి.

# పెహల్గమ్ బాధితులతో మోడీ మాట



**కాన్పూర్ (ప్రశ్న న్యూస్)**దనరేంద్ర మోదీ శుక్రవారం కాన్పూర్ పర్యటనలో భాగంగా పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన వ్యాపారి శుభం ద్వివేదీకి చెందిన కుటుంబ సభ్యులను కలిశారు. ప్రధానమంత్రి మోదీని కలిసిన తర్వాత శుభం ద్వివేదీ భార్య అయిన ఆశాన్య ద్వివేదీ మాట్లాడుతూ, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం ఇంకా ముగియలేదని ప్రధానమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.ఆశాన్య ద్వివేదీ మాట్లాడుతూ, "ప్రధానమంత్రి మోదీ మాతో మొత్తం దేశం, ప్రభుత్వం అండగా ఉందని అన్నారు. ఆయన చాలా బాధపడ్డారు, పహల్గాం ఉగ్రవాద దాడి రోజు ఏం జరిగిందో నన్ను అడిగారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం ముగియలేదని ఆయన అన్నారు. మళ్ళీ కలుస్తానని ఆయన హామీ ఇచ్చారు" అని తెలిపారు.ప్రధానమంత్రి మోదీని కలిసిన తర్వాత శుభం ద్వివేదీ తండ్రి సంజయ్ ద్వివేదీ మాట్లాడుతూ, "పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఒక ఆపరేషన్ ప్రారంభించారు, పాకిస్తాన్‌లోని ఉగ్రవాద కేంద్రాలను నాశనం చేసినందుకు మేము కృతజ్ఞతలు తెలియజేశాం. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటంలో మొత్తం దేశం ప్రధానమంత్రితో ఉంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందని ప్రధానమంత్రి మోదీ మాకు చెప్పారు. ప్రధానమంత్రి మోదీ కూడా భావోద్వేగానికి లోనయ్యారు" అని అన్నారు.కాన్పూర్ ఎంపీ రమేష్ అవస్థి ఒక వారం క్రితం ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ రాసి, పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన శుభం ద్వివేదీ కుటుంబాన్ని కలవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఆయన రిక్వస్ట్ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం కాన్పూర్‌లోని చాకేరి విమానాశ్రయంలో పహల్గామ్ ఉగ్రవాద బాధితుడు శుభం ద్వివేది కుటుంబాన్ని కలిశారని వార్తా సంస్థ పిటిఐ రిపోర్టు చేసింది. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాద దాడిలో మరణించిన 26 మందిలో ద్వివేది కూడా ఉన్నారు."పీఎంఓ నిర్ణయం గురించి మృతుల కుటుంబ సభ్యులకు ముందే తెలియజేశాం. ప్రధాని మోదీ తన ప్రత్యేక విమానం దిగిన వెంటనే విమానాశ్రయంలో శుభం భార్య అశాన్య, ద్వివేదీతల్లిదండ్రులు సంజయ్ ద్వివేది, సీమా ద్వివేదిని కలుస్తారు" అని కాన్పూర్ జిల్లా మేజిస్ట్రేట్ జితేంద్ర ప్రతాప్ సింగ్ ముందుగా వార్తా సంస్థ పిటిఐకి తెలిపారు.ఈ ఏడాది ఫిబ్రవరి 12న వివాహం చేసుకున్న ద్వివేది తన భార్య, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి పహల్గామ్‌ను సందర్శిస్తుండగా, ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరపడంతో ఆయన మరణించారు. ఏప్రిల్ 24 ఉదయం పూర్తి ప్రభుత్వ గౌరవాలతో ఆయన స్వగ్రామంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. ఉత్తరప్రదేశ్ క్యాబినెట్ మంత్రులు యోగేంద్ర ఉపాధ్యాయ్, రాకేష్ సచన్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588